



# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY






SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 సంచిక : 254 తూర్పుగోదావరి జిల్లా ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ శుక్రవారం 05 జూన్ 2026 పేజీలు : 12 వెల : 2/-


### ‘అమరావతి ఐ’ సహా కీలక ప్రతిపాదనలకు

# గ్రీన్ సిగ్నల్

- సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఏపీ కేబినెట్ సమావేశం
- గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని 125 రోజులకు పెంచుతూ కీలక నిర్ణయం
- రాష్ట్రానికి కొత్త విమానయాన పాలసీ, పర్యాటకాన్ని పెంచేలా బీచ్ షాక్‌ల ఏర్పాటు
- అగ్రిగోల్డ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక కోర్టుకు సిబ్బంది నియామకం, సబ్ కమిటీ ఏర్పాటు
- పోలవరం ఎడమ కాలువకు సవరించిన అంచనాలు, పలు పారిశ్రామిక ప్రాజెక్టులకు భూకేటాయింపులు

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన గురువారం జరిగిన ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశం, రాష్ట్ర సమగ్రాభివృద్ధికి బాటలు వేసే పలు చారిత్రాత్మక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. రాజధాని అమరావతికి అంతర్జాతీయ గుర్తింపు తెచ్చే ‘అమరావతి ఐ’ ప్రాజెక్టు నుంచి గ్రామీణ పేదల బతుకులకు భరోసా ఇచ్చే కొత్త ఉపాధి హామీ పథకం వరకు దాదాపు 35కు పైగా కీలక అంశాలపై కేబినెట్ సుదీర్ఘంగా చర్చించి ఆమోదముద్ర వేసింది. సమావేశం అనంతరం సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు కేబినెట్ నిర్ణయాలను సమగ్రంగా వివరించారు.



**అమరావతికి ఐకానిక్‌గా ‘అమరావతి ఐ’**

లండన్, దుబాయ్ నగరాల్లోని ఐకానిక్ నిర్మాణాల తరహాలో, కృష్ణా నది ఒడ్డున ఆరు ఎకరాల విస్తీర్ణంలో ‘అమరావతి ఐ’ నిర్మాణానికి కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. డిజైన్, బిల్డ్, ఫైనాన్స్, ఆపరేట్ అండ్ ట్రాన్స్‌ఫర్ పద్ధతిలో 30 ఏళ్ల లీజు ప్రాతిపదికన ఈ ప్రాజెక్టును చేపట్టనున్నారు. దీనికోసం టెండర్లు ఆహ్వానించేందుకు మంత్రివర్గం అనుమతి ఇచ్చింది. ఈ ప్రాజెక్టు ద్వారా అమరావతి, కృష్ణా నది అందాలను పర్యాటకులు వీక్షించేందుకు వీలు కలుగుతుందని, ఇది ప్రపంచ పర్యాటక పటంలో అమరావతికి ప్రత్యేక స్థానం కల్పిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

**రాజధాని నిర్మాణ పనులకు ఊతం**

అమరావతిలో

మిగతా .. 2లో..

### తెలంగాణను అస్థిరపరిచే రాజకీయాలకు

# నేను వ్యతిరేకం

జూన్ 2న చేసిన వ్యాఖ్యలపై దుమారం రేగడంతో పవన్ కల్యాణ్ వివరణ
పరస్పర గౌరవంతో ముందుకెళ్లడమే తన విధానమంటూ స్పష్టీకరణ
ఎక్స్ వేదికగా పోస్ట్.. గతంలోని వీడియోను పంచుకున్న జనసేనాని



**విశ్వం వాయిస్ న్యూస్ :** తెలంగాణను అస్థిరపరిచే రాజకీయాలకు తాను ఎన్నడూ మద్దతు ఇవ్వలేదని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. పరస్పర గౌరవం, శాంతి, సహకారంతో రెండు తెలుగు రాష్ట్రాల ప్రయోజనాలను కాపాడాలన్నదే తన అభిమతమని ఆయన తేల్చిచెప్పారు. జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తాను చేసిన వ్యాఖ్యలపై నెలకొన్న వివాదంపై ఆయన గురువారం ‘ఎక్స్’ (ట్విట్టర్) వేదికగా స్పందించారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షల పట్ల తన వైఖరి రాష్ట్ర విభజన నాటి నుంచి ఇప్పటివరకూ మారలేదని పేర్కొన్నారు. విభజన తర్వాత తాను ‘సెక్షన్ 8’ అమలును వ్యతిరేకించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఇది తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని, స్వయంపాలనా హక్కును దెబ్బతీస్తుందనే భావనతోనే ఆనాడు ఆ విధంగా స్పందించానని వివరించారు. ఇరు రాష్ట్రాల మధ్య విశ్వాసాన్ని పెంపొందించే యంత్రాంగాలు ఉండాలని తాను సూచించినట్లు తెలిపారు. తన పూర్వ వైఖరిని ధ్రువీకరించే పాత వీడియో క్లిప్‌ను కూడా ఆయన ఈ పోస్టుకు జతచేశారు. గతంలో జూన్ 2న గచ్చిబౌలిలో జనసేన సభకు పోలీసులు అనుమతి నిరాకరించడంతో, పవన్ కల్యాణ్ తన నివాసంలో మీడియా సమావేశం నిర్వహించిన సంగతి తెలిసిందే. ఆ సందర్భంగా, తెలంగాణలో 2029 అసెంబ్లీ ఎన్నికలతో పాటు జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనూ జనసేన పోటీ చేస్తుందని ఆయన ప్రకటించారు. అయితే, ‘అతివాద ప్రాంతీయత’పై ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా పెను దుమారం రేపాయి. పవన్ వ్యాఖ్యలపై తెలంగాణ అధికార పక్షమైన

మిగతా .. 2లో..

### ఏపీ రాజ్యసభ సీట్ల పంపకం పూర్తి..

# టీడీపీకి 3, జనసేనకు 1

- రాజ్యసభ సీట్ల పంపకాలపై కొలిక్కి వచ్చిన ఫార్ములా
- టీడీపీకి మూడు, జనసేనకు ఒక స్థానం కేటాయింపు
- ఈసారి బీజేపీకి దక్కని రాజ్యసభ అవకాశం
- సీఎం చంద్రబాబు నేతృత్వంలో జరిగిన సమావేశంలో తుది నిర్ణయం
- జూన్ 18న నాలుగు స్థానాలకు జరగనున్న పోలింగ్



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌లో నాలుగు రాజ్యసభ స్థానాలకు సంబంధించి అధికార ఎన్డీఏ కూటమిలో సీట్ల పంపకం ఖరారైంది. కూటమిలోని ప్రధాన పార్టీ అయిన తెలుగుదేశం పార్టీ (టీడీపీ) మూడు స్థానాలను తీసుకోనుండగా, జనసేన పార్టీకి ఒక స్థానాన్ని కేటాయించారు. ఈ సర్దుబాటులో బీజేపీకి ఈసారి అవకాశం లభించలేదు. ఉండవల్లిలోని ముఖ్యమంత్రి చంద్రబాబు క్యాంపు కార్యాలయంలో గురువారం జరిగిన కీలక సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ భేటీలో సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఏపీ బీజేపీ అధ్యక్షుడు మాధవ్ పాల్గొన్నారు. ఈ భేటీలో మిత్రపక్ష నేతలతో చర్చించిన అనంతరం, సీట్ల కేటాయింపు నిర్ణయాన్ని సీఎం స్వయంగా వెల్లడించారు. మూడు పార్టీల నేతల ఏకాభిప్రాయంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. త్వరలోనే రాజ్యసభ అభ్యర్థుల పేర్లను అధికారికంగా ప్రకటిస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాష్ట్ర అసెంబ్లీలో ఉన్న సంఖ్యా బలం ఆధారంగానే ఈ కేటాయింపులు జరిపినట్లు స్పష్టమవుతోంది. అసెంబ్లీలో టీడీపీకి భారీ మెజారిటీ ఉండగా, జనసేనకు 21 మంది

మిగతా .. 2లో..

### దమ్ముంటే నన్ను

# అరెస్ట్ చేయండి

బియ్యం దొంగతనం చేశానని తనపై ఆరోపణలు చేస్తున్నారన్న మాజీ మంత్రి పేర్ని నాని




**తాడేపల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో డీఎస్సీ, స్పోర్ట్స్ కోటా ఉద్యోగాల భర్తీ వ్యవహారం ఇప్పుడు తీవ్ర దుమారం రేపుతోంది. ఈ అంశంపై వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి పేర్ని నాని కూటమి ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. సీఎం చంద్రబాబు, మంత్రులు అనిత, కొల్లు రవీంద్రలను టార్గెట్ చేస్తూ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ అవగాహన సదస్సులో మాట్లాడిన ఆయన.. ప్రభుత్వానికి ఒక సవాల్ విసిరారు. “నేను బియ్యం దొంగతనం చేశానని నాపై ఆరోపణలు చేస్తున్నారు. మీకు నిజంగా ధైర్యముంటే, నాపై విచారణ జరిపించి నన్ను జైల్లో పెట్టండి. 2029 నాటికి చంద్రబాబు ప్రభుత్వం కచ్చితంగా పడిపోతుంది. అంతవరకు మీకు చేతనైతే, దమ్ముంటే నన్ను అరెస్ట్ చేయండి” అంటూ పేర్ని నాని సంచలన వ్యాఖ్యలు చేశారు. స్పోర్ట్స్ కోటా నియామకాల్లో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని పేర్ని నాని ఆరోపించారు. ప్రభుత్వం మొదట క్రీడా కోటాను 3 శాతానికి పెంచుతూ జీవో ఇచ్చిందని, ఆ తర్వాత 382 మంది

మిగతా .. 2లో..

# ఏపీకి పెట్టుబడులే లక్ష్యం

రష్యాలో జరిగిన అంతర్జాతీయ ఆర్థిక ఫోరంలో మంత్రి లోకేష్ ప్రసంగం
పెట్టుబడిదారులుగా కాకుండా భాగస్వాములుగా ఏపీకి రావాలని ఆహ్వానం
ఏపీలో స్పేస్, ఏరోస్పేస్, సెమీకండక్టర్ల రంగాల్లో పెట్టుబడులపై దృష్టి



**రష్యా, విశ్వం వాయిస్ న్యూస్ :** రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో నిర్వహించిన అంతర్జాతీయ ఆర్థిక ఫోరం వేదికగా ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రసంగించారు. కేవలం పెట్టుబడిదారులుగానే కాకుండా, రాష్ట్ర అభివృద్ధిలో దీర్ఘకాలిక భాగస్వాములుగా పాలుపంచుకోవాలని రష్యా పారిశ్రామికవేత్తలను, దిగ్గజ సంస్థలను ఆయన సాదరంగా ఆహ్వానించారు. భారత్–రష్యాల మధ్య బంధం కేవలం వ్యాపార ఒప్పందాలకే పరిమితం కాదని, అది ఒక దృఢమైన అనుబంధమని లోకేష్ పేర్కొన్నారు. భిలాయ్ స్టీల్ ప్లాంట్ నుంచి గగన్‌యాన్ ప్రాజెక్టు వరకు అనేక కీలక సందర్భాల్లో రష్యా భారత్‌కు అండగా నిలిచిందని ఆయన గుర్తుచేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ నిర్దేశించుకున్న 2030 నాటికి 100 బిలియన్ డాలర్ల ద్వైపాక్షిక వాణిజ్య లక్ష్యాన్ని చేరుకోవడంలో ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర పోషించనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో ఆంధ్రప్రదేశ్ శరవేగంగా అభివృద్ధి చెందుతోందని, 2047 నాటికి రాష్ట్ర జీడీపీని 2.5 ట్రిలియన్ డాలర్లకు చేర్చడమే లక్ష్యమని వివరించారు. వెయ్యి కిలోమీటర్ల మేర విస్తరించిన సుదీర్ఘ తీరప్రాంతం, ఆరు ప్రధాన ఓడరేవులు, పటిష్టమైన మౌలిక సదుపాయాలు, నిరంతరాయ విద్యుత్ సరఫరా వంటి అంశాలు రాష్ట్రంలో పెట్టుబడులకు ఎంతో అనువైనవని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం

మిగతా .. 2లో..

# మోదీ మంచి మిత్రుడే.. కానీ

**భారత్‌పై ట్రంప్ శైలి విమర్శలు**



**విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రధాని నరేంద్ర మోదీని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రశంసిస్తూనే.. భారత్‌పై విమర్శలు చేశారు. అమెరికాపై అధిక సుంకాలు విధించి.. భారత్ ఏళ్లతరబడి లబ్ధి పొందిందని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఇవి చర్చనీయాంశంగా మారాయి. వైట్‌హౌస్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ట్రంప్ మాట్లాడారు. భారత్– అమెరికా మధ్య ఉన్న బలమైన వ్యక్తిగత సంబంధాల గురించి ఆయన ప్రస్తావించారు. ప్రధాని మోదీ

మిగతా .. 2లో..

# 9 నెలల్లో ఉదండాపూర్‌కు నీళ్లు

ఉమ్మడి పాలమూరు ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యం
సమీక్షలో తెలంగాణా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



**నాగర్‌కర్నూల్, విశ్వం వాయిస్ న్యూస్ :** వచ్చే తొమ్మిది నెలల్లో పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టు ప్రధాన పనులు పూర్తి చేసి నార్లాపూర్ జలాశయం నుంచి ఉదండాపూర్ జలాశయం వరకు కృష్ణా జలాలు చేరాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని పేర్కొన్నారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం సోమశిలలో ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రాజెక్టులపై నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఇతర జిల్లా మంత్రులతో కలిసి సీఎం సమీక్ష నిర్వహించారు. అంతకు ముందు పలు ప్రాజెక్టులను క్షేత్రస్థాయిలో సందర్శించిన సీఎం ఇంజినీర్లతో ముఖాముఖి మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.

**భూసేకరణ బాధ్యత కలెక్టర్లదే..**

“ప్రాజెక్టుల పూర్తికి మొదటి ప్రాధాన్యం కింద భూసేకరణ ప్రక్రియ పెట్టుకోవాలి. స్థానిక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమన్వయం చేసుకుని భూసేకరణ పూర్తి చేయాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్లదే. వారు క్షేత్రస్థాయికి వెళ్లి సమస్యను పరిష్కరించాలి. రాష్ట్ర వ్యాప్తంగా

మిగతా .. 2లో..

### ప్రభుత్వ ఉద్యోగానికి

# అధిక విద్యార్హతలుంటే అర్హులు కారు

సుప్రీంకోర్టు స్పష్టీకరణ
అటెండెంట్ పోస్టులో నియమితుడైన పట్టభద్రుడి తొలగింపునకు సమర్థన




**ఢిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో అర్హతగా పేర్కొన్న క్వాలిఫికేషన్‌కు సంబంధించిన వారినే తీసుకోవాలని, అంతకంటే అధిక అర్హతలు ఉన్న వారిని తీసుకోకూడదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. తక్కువ అర్హతలు ఉన్న వారి కోసం ఉద్దేశించిన ఉద్యోగాన్ని ఎక్కువ అర్హతలున్న వారికి ఇవ్వడంవల్ల వాస్తవంగా అర్హత, యోగ్యత ఉన్న వారికి అన్యాయం జరుగుతుందని అభిప్రాయపడింది. తమిళనాడులోని ఒక బ్యాంకులో తాత్కాలిక ప్రాతిపదికన అటెండెంట్‌గా నియమితుడైన పట్టభద్రుణ్ని ఆ ఉద్యోగం నుంచి తొలగించడాన్ని జస్టిస్ అహసానుద్దీన్ అమానుల్లా, జస్టిస్ ఆర్.మహాదేవన్‌లతో కూడిన ధర్మాసనం సమర్థించింది. ఆ ఉద్యోగిని తొలగిస్తూ బ్యాంకు తీసుకున్న నిర్ణయాన్ని రద్దు చేసి పట్టభద్రుణ్ని ఉద్యోగంలో తిరిగి

మిగతా .. 2లో..

### ఒత్తిళ్లకు

# మోదీ తలొగ్గరు

దానిపై పాశ్చాత్య దేశాల ప్రయత్నం వ్యర్థం: పుతిన్



**మాస్కో, విశ్వం వాయిస్ న్యూస్ :** అమెరికాతో భారత్ సంబంధాలు పెరుగుతున్నంత మాత్రాన దీర్ఘకాలం నుంచి భారత్‌తో తమకున్న సంబంధాలు తగ్గిపోవని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ పేర్కొన్నారు. రష్యాతో సంబంధాల విషయంలో భారత ప్రధాని నరేంద్రమోదీపై ఒత్తిడికి పాశ్చాత్య దేశాలు ప్రయత్నాలు చేయడం వ్యర్థమని, అది ప్రపంచంలో అస్థిరతకు దారితీస్తుందని చెప్పారు. గురువారం సెయింట్‌పీటర్స్‌బర్గ్‌లో ప్రపంచ వార్తా సంస్థల అధినేతలతో ఆయన మాట్లాడారు. “భారత్ మాకు

మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

## 'అమరావతి ఐ' సహా కీలక ప్రతిపాదనలకు
# గ్రీన్ సిగ్నల్

నిర్మాణ పనులను వేగవంతం చేసే దిశగా కేబినెట్ పలు నిర్ణయాలు తీసుకుంది. హైకోర్టు భవనం బాహ్య సుందరీకరణ పనుల కోసం రూ. 547 కోట్లకు పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. అదేవిధంగా, ఆల్ ఇండియా సర్వీసెస్ అధికారులు, ప్రిన్సిపల్ సెక్రటరీల నివాస భవనాల్లో హోమ్ ఆటోమేషన్, ఇతర ఆధునిక సౌకర్యాల కల్పన కోసం రూ. 94.90 కోట్ల పనులకు ఆమోదం తెలిపింది. రాజధానిలో అంతర్జాతీయ స్థాయి కన్వెన్షన్ సెంటర్ నిర్మాణం కోసం ఏపీఐఐసీకి ఎనిమిది ఎకరాల భూమి కేటాయింపును నిర్ధారించారు. రానున్న 9-10 నెలల్లో దీని నిర్మాణం పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

**గ్రామీణ ఉపాధికి 125 రోజుల గ్యారెంటీ**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో 'వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ (గ్రామీణ్)' పథకాన్ని రాష్ట్రంలో అమలు చేసేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. జూలై 1, 2026 నుంచి ఈ పథకం అమలులోకి వస్తుంది. దీని కింద ప్రస్తుతం ఉన్న 100 రోజుల ఉపాధి హామీని 125 రోజులకు పెంచారు. దీనివల్ల ప్రతి గ్రామీణ కుటుంబానికి అదనంగా ఏటా రూ. 7,675 లబ్ధి చేకూరుతుంది. ఈ పథకానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో నిధులు సమకూరుస్తాయి. అంతేకాకుండా, కూలీలకు 15 రోజుల్లోగా వేతనాలు చెల్లించాలని, ఆలస్యమైతే రోజుకు 0.05% చొప్పున వడ్డీ చెల్లించాలని నిబంధన విధించడం గమనార్హం.

**కొత్త పాలసీలతో ప్రగతి పథం**

విమానయాన పాలసీ: రాష్ట్ర విమానయాన రంగంలో భారీ లక్ష్యాలతో కొత్త పాలసీకి కేబినెట్ ఆమోదం తెలిపింది. 2035 నాటికి ప్యాసింజర్ మార్కెట్ షేర్‌ను 4 శాతానికి, ఎయిర్ కార్గో మార్కెట్ షేర్‌ను 5 శాతానికి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కొత్త విమానాశ్రయాలు, వాటర్ డ్రోమ్‌ల ఏర్పాటు, ఏరోస్పేస్ తయారీలో పెట్టుబడులను ఆకర్షించడం ఈ పాలసీ ముఖ్య ఉద్దేశాలు.

**బీచ్ షాక్ పాలసీ:** రాష్ట్రంలో పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు గోవా, ఒరిస్సా తరహాలో బీచ్ షాక్‌ల ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. పైలట్ ప్రాజెక్ట్‌గా తొలి దశలో చీరాలలోని సూర్యలంక, విశాఖపట్నం బీచ్‌లలో రెండేసి చొప్పున షాక్‌లను ఏర్పాటు చేస్తారు.

**అవయవదాన చట్టం:** అవయవదానం, అవయవ మార్పిడి కార్యకలాపాలను నియంత్రించేందుకు కేంద్రం తీసుకొచ్చిన 'ది ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆఫ్ హ్యూమన్ ఆర్గాన్స్ అండ్ టిష్యూస్ యాక్ట్-2011'ను రాష్ట్రంలో అమలు చేసేందుకు కేబినెట్ నిర్ణయించింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు, అవయవాల అక్రమ రవాణాను అరికట్టేందుకు ఈ చట్టాన్ని ఆర్డినెన్స్ రూపంలో తీసుకురానున్నారు.

**వ్యవసాయం, పరిశ్రమలకు చేయూత**

పోలవరం ఎడమ ప్రధాన కాలువ ప్యాకేజీ 5, 5ఏ పనులకు సంబంధించి అంచనా వ్యయాన్ని రూ. 352.6 కోట్ల నుంచి రూ. 796.66 కోట్లకు సవరిస్తూ కేబినెట్ పరిపాలన అనుమతులు ఇచ్చింది. అగ్రిగోల్డ్ కేసుల సత్వర పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక కోర్టుకు 21 పోస్టులను మంజూరు చేసింది. ఈ కేసుల పరిష్కారానికి మంత్రులతో ఒక సబ్ కమిటీని కూడా ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో సోలార్, విండ్ పవర్ ప్రాజెక్టుల ఏర్పాటు కోసం నెడ్‌క్యాప్ ద్వారా పలు కంపెనీలకు భూములు లీజుకు ఇచ్చే ప్రతిపాదనలకు కూడా ఆమోదం లభించింది.

**ఇతర కీలక నిర్ణయాలు**

**శ్రీ సిటీ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ:** తిరుపతి జిల్లా శ్రీ సిటీలో కొత్త ప్రైవేట్ యూనివర్సిటీ ఏర్పాటుకు వీలుగా ఏపీ ప్రైవేట్ యూనివర్సిటీ యాక్ట్-2016 సవరణకు ఆర్డినెన్స్ జారీకి ఆమోదం.

**అంతర్జాతీయ యోగా దినోత్సవం:** జూన్ 7 నుంచి 21 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా యోగా దినోత్సవ వేడుకలు నిర్వహించేందుకు రూ.10 కోట్లు మంజూరు.

**భూముల రీ-క్లాసిఫికేషన్:** గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు గ్రామంలోని 25 ఎకరాల 'ట్యాంక్ పోరంబోకు' భూమిని 'గ్రామ కంఠం'గా మార్చేందుకు నిర్ణయం. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి సమస్యలను పరిష్కరించాలని సీఎం ఆదేశించారు.

**టీడీపీ కార్యాలయాలకు భూమి:** అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లో తెలుగుదేశం పార్టీ కార్యాలయాల నిర్మాణానికి 66 ఏళ్ల లీజు ప్రాతిపదికన భూమి కేటాయింపునకు కేబినెట్ ఆమోదం తెలిపింది.

మొత్తంమీద, ఈ కేబినెట్ సమావేశం రాజధాని అమరావతి నిర్మాణాన్ని పరుగులు పెట్టించడం, పర్యాటక రంగానికి కొత్త ఊపునివ్వడం, గ్రామీణ ప్రజలకు ఆర్థిక భరోసా కల్పించడం, పారిశ్రామిక అభివృద్ధిని వేగవంతం చేయడం వంటి బహుముఖ లక్ష్యాలతో సాగింది. ఈ నిర్ణయాలు రాబోయే రోజుల్లో రాష్ట్ర ప్రగతిపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతాయని ప్రభుత్వం విశ్వాసం వ్యక్తం చేస్తోంది.

## తెలంగాణను అస్థిరపరిచే రాజకీయాలకు
# నేను వ్యతిరేకం

కాంగ్రెస్‌తో పాటు ఇతర పార్టీల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. మంత్రి పొన్నం ప్రభాకర్ సహా పలువురు నేతలు స్పందిస్తూ.. సుదీర్ఘ ఉద్యమాల ద్వారా సాధించుకున్న తెలంగాణలో ఇక్కడి వ్యవహారాల్లో ఇతరుల జోక్యం తగదని హితవు పలికారు. ఈ రాజకీయ పరిణామాల నేపథ్యంలోనే పవన్ కల్యాణ్ తాజాగా వివరణ ఇచ్చారు.

## ఏపీ రాజ్యసభ సీట్ల పంపకం పూర్తి..
# టీడీపీకి 3, జనసేనకు 1

ఎమ్మెల్యేలు ఉన్నారు. షెడ్యూల్ ప్రకారం జూన్ 18న నాలుగు రాజ్యసభ స్థానాలకు పోలింగ్ జరగనుంది. ప్రస్తుతం వైసీపీకి చెందిన మూడు, టీడీపీకి చెందిన ఒక స్థానం ఖాళీ అవుతున్నాయి. అసెంబ్లీలో ఎన్డీఏ కూటమికి ఉన్న పూర్తి ఆధిక్యతతో ఈ నాలుగు స్థానాలను గెలుచుకోవడం లాంఛనప్రాయమే. కాగా, నేటి ఎన్డీయే సమావేశంలో కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల రెండేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై కూడా సుదీర్ఘంగా చర్చించారు. ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు మూడు ప్రాంతాల్లో బహిరంగ సభలు నిర్వహించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా జూన్ 9న తిరుపతిలో 'సంక్షేమం', 12న అమరావతిలో 'సుపరిపాలన', 15న విశాఖపట్నంలో 'అభివృద్ధి' అనే అంశాలపై సభలు జరపాలని చంద్రబాబు సూచించారు.

## దమ్ముంటే నన్ను
# అరెస్ట్ చేయండి

ఎంపికయ్యారని చెప్పిందని.. కానీ ఇటీవలే ఆటల సంఖ్యను 29 నుంచి ఏకంగా 67 కి పెంచి, అందులో 'బ్రిడ్జ్' (పేకాట)ను కూడా చేర్చారని విమర్శించారు. ఎంపికైన అభ్యర్థుల జాబితాను గత 9 నెలలుగా ఎందుకు బహిరంగపరచడం లేదు? ఐఏఎస్ అధికారి సంతకం కూడా లేకుండా ఆ లిస్ట్‌ను ఎలా విడుదల చేశారు? ఇప్పుడు కార్డ్ గేమ్స్ (పేకాట) ఆడేవారిని ఎంపిక చేయలేదని ప్రభుత్వం ఎందుకు మాట మారుస్తోంది? అని ప్రశ్నించారు. డీఎస్సీ నియామకాల్లో జరిగిన భారీ అక్రమాలను కప్పిపుచ్చుకోవడానికే కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టడానికి హోంమంత్రి అనితను ఒక కవచంలా వాడుకుంటోందని పేర్ని నాని మండిపడ్డారు. రాష్ట్రంలో మహిళలు, బాలికలపై జరుగుతున్న అరాచకాలపై నోరు మెదపని ప్రభుత్వం.. ప్రతిపక్షాలు డీఎస్సీ స్కామ్‌ను లేవనెత్తినప్పుడు మాత్రం హైపర్‌యాక్టివ్‌గా మారుతోందని ధ్వజమెత్తారు. డీఎస్సీ రిక్రూట్‌మెంట్‌లో జరిగిన 'పాపాలు' చంద్రబాబును, ఆయన మంత్రులను వదిలిపెట్టవని పేర్ని నాని హెచ్చరించారు.

# ఏపీకి పెట్టుబడులే లక్ష్యం

స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఈ సందర్భంగా ఆయన భరోసా ఇచ్చారు. అంతరిక్ష రంగంలో ఇరు దేశాల మధ్య సహకారం నూతన శిఖరాలకు చేరుతోందని, భారత దేశపు ఏకైక స్పేస్‌పోర్ట్ శ్రీహరికోట ఆంధ్రప్రదేశ్‌లోనే ఉందని లోకేష్ గుర్తుచేశారు. ఈ క్రమంలో రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్న 'స్పేస్ సిటీ'లో పెట్టుబడులు పెట్టాలని 'రోస్‌కోస్మోస్' వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలను ఆహ్వానించారు. ఏరోస్పేస్, సెమీకండక్టర్లు, ఇంధన రంగాల్లో రష్యన్ సంస్థలకు అపారమైన అవకాశాలు ఉన్నాయని, ఉమ్మడిగా ఉజ్వల భవిష్యత్తును నిర్మిద్దామని ఆయన పిలుపునిచ్చారు.

# మోదీ మంచి మిత్రుడే.. కానీ

అంటే తనకు చాలా ఇష్టమని.. ఆయన గొప్ప స్నేహితుడని ట్రంప్ అన్నారు. తమ మధ్య మంచి సంబంధాలు ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా వాణిజ్య చర్చలకు సంబంధించిన ప్రశ్నకు బదులిస్తూ.. భారతదేశ సుంకాల విధానంపై ఆయన విమర్శలు చేశారు. 'ఏళ్లతరబడి.. అమెరికా నుంచి భారత్ చాలా లబ్ధి పొందింది. మాపై వారు భారీగా సుంకాలు విధించారు. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ప్రస్తుతం భారత్ నుంచి మేం భారీగా లాభాలు పొందుతున్నాం' అని వ్యాఖ్యానించారు. భారత్- అమెరికా మధ్య త్వరలోనే వాణిజ్య ఒప్పందం కుదురుతుందని తాను భావిస్తున్నట్లు తెలిపారు. వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేయడమే లక్ష్యంగా ఇరుదేశాల ప్రతినిధుల మధ్య నాలుగు రోజుల పాటు సాగిన చర్చలు ముగిశాయి. ఈ క్రమంలో ట్రంప్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఒప్పందానికి సంబంధించిన చర్చలు సహకార స్ఫూర్తి, ఆచరణాత్మకంగా ముగిశాయని వాణిజ్య శాఖ తెలిపింది. వస్తువుల వాణిజ్యం, కస్టమ్స్ విధానాలు, వాణిజ్య సౌలభ్యం, టారిఫేతర చర్యలు, ఆర్థిక భద్రతా సహకారం వంటి పలు అంశాలపై చర్చలు సాగినట్లు పేర్కొంది.

# 9 నెలల్లో ఉదండాపూర్‌కు నీళ్లు

ప్రాజెక్టుల కింద చేయాల్సిన భూసేకరణకు నెలకు రూ.500 కోట్ల చొప్పున ప్రభుత్వం విడుదల చేస్తుంది. ఒక కార్యాచరణ ఏర్పాటు చేసుకుని ప్రణాళికా బద్ధంగా పునరావాసం-పునర్నివాస చర్యలు కూడా పూర్తి చేయాలి" అని ఆదేశించారు. పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో నార్లాపూర్ నుంచి ఉదండాపూర్ జలాశయం వరకు ఉన్న అవరోధాలేంటని సీఎం ఆరా తీశారు. 'ఈ ప్రాజెక్టులోని ఐదు జలాశయాల్లో పావు భాగం వరకు నీటిని నింపేందుకు అవసరమైన ప్రధాన పనులు పూర్తి చేయాలి. 2-3 నెలల్లో ఈ ప్రాజెక్టులో మిగిలిన భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్ పనులు పూర్తి చేయాలి' అని సీఎం ఆదేశించారు. ఇంజినీర్లు స్పందిస్తూ ఈ ప్రాజెక్టు కింద రూ.1,400 కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని తెలపగా.. కిస్తీల వారీగా అన్నీ విడుదల చేస్తామని సీఎం అన్నారు. ప్రతిపాదిత లక్ష్మీదేవిపల్లి జలాశయ నిర్మాణానికి భూసేకరణ చేపట్టాలి' అని ఆదేశించారు.

**కాలువలకు టెండర్లు పిలవండి**

కరవు పీడిత ప్రాంతాలకు నీటిని అందించే నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకం పనులు వేగంగా చేపట్టాలని సీఎం ఆదేశించారు. 'నా నియోజకవర్గానికి ఇప్పటి వరకు కృష్ణా జలాలు పోవడంలేదు. త్వరగా పనులు చేయండి. రెండు నెలల్లో భూసేకరణ పూర్తి చేయండి. వెంటనే కాలువలకు అంచనాలు సిద్ధం చేసి టెండర్లు పూర్తి చేయాలి' అని ఆదేశించారు. ఇంజినీర్లు స్పందిస్తూ ఈ పథకం కింద 6,400 ఎకరాలు అవసరం ఉండగా 4,200 ఎకరాల సేకరణకు ప్రకటన ఇవ్వగా.. 1,760 ఎకరాల సేకరణ పూర్తయిందని తెలిపారు. సీఎం స్పందిస్తూ సమస్యలను గుర్తించి త్వరగా పూర్తి చేసి పనుల్లో వేగం పెంచేలా చూడాలని ఆదేశించారు.

**ఇరవై ఏళ్లయినా కోయిలసాగర్ పూర్తి కాదా**

కోయిలసాగర్ ఎత్తిపోతల పథకం పనులు ఇరవై ఏళ్లయినా పూర్తికాకపోవడం ఏంటని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే పూర్తయేలా చూడాలన్నారు. ఇంజినీర్లు మాట్లాడుతూ గుత్తేదారు పనులు వదిలిపోవడంతో సమస్య ఏర్పడినట్లు తెలిపారు. తిరిగి టెండర్లు పిలిచినట్లు వివరించారు. రూ.150 కోట్ల నిధులు అవసరమని సీఎంకు తెలిపారు. జవహర్ నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంపైనా సీఎం ఆరా తీశారు. ఈ పథకంలోని గుడ్డెం దొడ్డి జలాశయ సామర్థ్యం పెంపు ఎంత వరకు వచ్చిందని అడిగారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

## ప్రభుత్వ ఉద్యోగానికి
# అధిక విద్యార్హతలుంటే అర్హులు కారు

నియమిస్తూ మద్రాస్ హైకోర్టు జారీ చేసిన ఆదేశాలను ధర్మాసనం పక్కన పెట్టింది. ఈ కేసులో కక్షిదారుడు తాను పట్టభద్రుడినన్న వాస్తవాన్ని దాచి పదో తరగతి చదువుకున్న వ్యక్తులకు దక్కాల్సిన ఉద్యోగం పొందాడని, ఈ విషయాన్ని హైకోర్టు పరిగణనలోకి తీసుకోలేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ప్రభుత్వోద్యోగాలు ఆ ఉద్యోగానికి కావాల్సిన అర్హత కలిగిన వారికే దక్కాలని పేర్కొంది. తమ కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా ఉన్నత విద్యను అభ్యసించలేకపోయిన వ్యక్తులకు ప్రయోజనం కలిగించేందుకే కొన్ని ఉద్యోగాలకు తక్కువ విద్యార్హతను నిర్ణయిస్తున్నారని, ఇది సహేతుకమైన, సమానత్వ ప్రాతిపదికన రూపొందించిన నిబంధన అని ధర్మాసనం తెలిపింది. 'ప్రభుత్వం ఒక ఆదర్శప్రాయమైన ఉపాధి కల్పన వ్యవస్థ. కొన్ని రకాల ఉద్యోగాలను తక్కువ విద్యార్హతలు కలిగిన వారికి రిజర్వు చేయడంద్వారా సహేతుకమైన విధానాన్ని అవలంబిస్తోంది. అలాంటి ఉద్యోగాలు పొందేందుకు నిర్దేశించిన దానికన్నా ఎక్కువ విద్యార్హతలు ఉన్న వారిని అనుమతిస్తే వారితో తక్కువ చదువుకున్న అభ్యర్థులు పోటీ పడలేరు. ఉద్యోగం సాధించలేరు. అందుకే కొన్ని రకాల ఉద్యోగాలను తక్కువ అర్హతలు కలిగిన వారికి రిజర్వు చేయడాన్ని న్యాయస్థానాలు ఎప్పుడూ సమర్థిస్తున్నాయి' అని ధర్మాసనం పేర్కొంది.

# మోదీ తలొగ్గరు


విశ్వసనీయ భాగస్వామి. వేరే ఏ దేశంతో అది ద్వైపాక్షిక సంబంధాలు కొనసాగించినా దానిలో మేం ఎలాంటి ప్రతికూల పరిణామాలు చూడబోం. కాలపరీక్షను తట్టుకుని నిలిచిన భారత్-రష్యా సంబంధాలపై ఏ విధమైన ప్రభావం పడదు. భారత్‌కు స్వతంత్ర విదేశాంగ విధానం ఉంది. తమ దేశ ప్రయోజనాలకు ముఖ్యమని అనుకున్న అన్ని దేశాలతో అది సంబంధాలను పెంపొందించుకుంటోంది. ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా భారత్ నిలుస్తోంది. బలమైన స్థాయిలో ఆకట్టుకునే రీతిలో వృద్ధి సాధిస్తోంది. ఇది ఆయాచితంగా వచ్చిందేమీ కాదు. మోదీ నేతృత్వంలోని సర్కారు కష్టపడి చేస్తున్న పనికి ఫలితం ఇది. రాబోయే ఏళ్లలో భారత్‌తో ద్వైపాక్షిక వాణిజ్యం విస్తరించి, 100 బిలియన్ డాలర్లకు చేరుతుందని భావిస్తున్నాను. భారత్ గొప్పదేశం. అక్కడి ప్రజాస్వామ్యం గొప్పది" అని పుతిన్ చెప్పారు.

# రిజల్ట్ డే @ 2024 - పవన్ ఏం చేశారు? రెండేళ్ల క్రితం నాటి ఫోటో స్టోరీ

జూన్ 4, ఈ తేదీకి తెలుగు రాజకీయాల్లో ముఖ్యంగా ఏపీ పాలిటిక్స్ లో ప్రత్యేక గుర్తింపు ఉంది. 2024లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఆ ఏడాది జూన్ 4న విడుదలయ్యాయి. ఈ రెండేళ్లలో రాష్ట్రంలో ఎన్నో రాజకీయ మార్పులు చోటుచేసుకున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, పవన్ కళ్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడం అన్నీ చకచకా జరిగిపోయాయి. అయితే, ఈ చారిత్రాత్మక విజయాన్ని గుర్తు చేస్తూ డిప్యూటీ సీఎం పవన్ ఫొటో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వైసీపీని ఓడించాలనే ఏకైక లక్ష్యంతో ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలిపోనివ్వనని చేసిన ప్రతిజ్ఞతో కూటమి ఏర్పాటులో కీలకపాత్ర పోషించిన పవన్.. ఫలితాల రోజున ఎలా ఉన్నారో తెలియజేసే ఆ ఫొటో నెటిజన్లను విశేషంగా ఆకర్షిస్తోందని చెబుతున్నారు.

**హడావిడికి భిన్నంగా!**

సాధారణంగా ఎన్నికల ఫలితాల రోజున ఏ రాజకీయ నాయకుడైనా తీవ్ర ఉత్కంఠకు లోనవుతుంటారు. గెలుపోటములపై అంచనాలు, ట్రెండ్స్ చూస్తూ క్షణం కూడా కాలు నిలవకుండా హడావుడి పడుతుంటారు. పార్టీ నేతలతో మంతనాలు జరుపుతూ, ఫలితాల సరళిని తెలుసుకుంటూ క్షణం కూడా తీరిక లేకుండా గడుపుతుంటారు. ఇక విజయం సాధిస్తున్న పక్షం ఎప్పుడు సంబరాలు చేసుకోవాలనే విషయంపైనా ప్లాన్ చేసుకుంటుంటారు. కానీ, నాడు జనసేన అధినేత పవన్ కల్యాణ్ వంద శాతం స్ట్రైక్ రేటుతో గెలిచినా ఆ హడావుడికి దూరంగానే ఉన్నారు. కూటమి ప్రభుత్వం తిరుగులేని విజయం సాధించి, ప్రత్యర్థి 11 సీట్లకు పరిమితమైనా జనసేనాని సంబరాలు



చేసుకోకుండా.. మౌనంగానే ఫలితాలను గమనిస్తూ గడిపేశారు. దీనికి సంబంధించిన ఫొటో ఇప్పుడు జనసేన పేజీల్లో హల్ చల్ చేస్తోంది. ఫలితాలు వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా జనసేన అఫీషియల్ గా తన ఎక్స్ ఖాతాలో ప్రత్యేక ట్వీట్లు చేసింది. "నెత్తిమీద కాలు వేసి తొక్కడం పూర్తయి రెండేళ్లు అయింది" అంటూ ఒక పోస్టు పెట్టింది. అదేసమయంలో ధైర్యానికి రెండేళ్లు అంటూ పవన్ వీడియోను పోస్టు చేసింది. ఇదే సమయంలో సాదాసీదాగా లాల్చీ, పంచెకట్టుతో తన నివాసంలోని సోఫాలో ప్రశాంతంగా కూర్చున్న పవన్ కళ్యాణ్ ఫొటో కూడా ఒకటి వైరల్ అవుతోంది. ఈ ఫొటో రెండేళ్ల క్రితం ఎన్నికల రోజు పవన్ నివాసంలో తీసినదిగా చెబుతున్నారు. ఎన్నికల్లో ఘన విజయం సాధించిన పవన్ మాత్రం ఎటువంటి రియాక్షన్ లేకుండా, ఫలితాలను వీక్షిస్తున్నట్లు ఆ ఫొటో వెల్లడిస్తోంది. దీంతో పవన్ వైఖరిపై నెటిజన్లు ఆసక్తికర వ్యాఖ్యలు చేస్తున్నారు. కూటమి విజయం సాధిస్తుందని సర్వేలు చెప్పిన జోస్యాలు నిజమవుతాయా అనే టెన్షన్ ఆయనలో అస్సలు కనిపించలేదని అంటున్నారు. మరోవైపు ప్రజలు మార్పును కోరుకుంటున్నారనే నమ్మకం ఆయనలో బలంగా కనిపించిందని మరికొందరు కామెంట్ చేస్తున్నారు. ఇక జనసైనికులు అయితే 'ఎలాగూ గెలుస్తున్నాం.. గెలిచిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలను ఎలా నెరవేర్చాలి? రాష్ట్రాన్ని ప్రగతి పథంలోకి ఎలా తీసుకెళ్లాలి? ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలి?' అనే దీర్ఘాలోచనలో ఉన్నట్లు కనిపిస్తోందని వ్యాఖ్యానిస్తున్నారు. ఇక ఈ ఫొటో చూసిన పరిశీలకులు కూడా ఆసక్తికరంగా స్పందిస్తున్నారు. రాజకీయాల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించే గుణం అందరికీ సాధ్యం కాదని విశ్లేషిస్తున్నారు. రసవత్తరంగా సాగిన ఎన్నికల యుద్ధంలో ఫలితాలు వెలువడే అత్యంత కీలకమైన సమయంలో కూడా ఎలాంటి చలనం లేకుండా, ఒక యోగిలా అంత నిశ్చలంగా కూర్చోవడం కేవలం పవన్ కల్యాణ్ లాంటి నాయకుడికే సాధ్యమని కొనియాడుతున్నారు. మొత్తానికి పవన్ ఫొటో సోషల్ మీడియాలో హాట్ డిబేట్ కు తెరలేపిందని వ్యాఖ్యానిస్తున్నారు.

# ఎడిటర్ వాయిస్

## ఏపీలో 'సర్'.. పార్టీల జాతకాలు తారుమారు చేస్తుందా? టెన్షన్‌లో నేతలు

ఏపీలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం (సర్) త్వరలో మొదలుకానుంది. ఈ నెల 15 నుంచి వచ్చేనెల 14తేదీ వరకు ఓటర్ల జాబితాను పరిశీలించేందుకు బూత్ లెవెల్ ఆఫీసర్లు ఇంటింటికి తిరగనున్నారు. వలస వెళ్లినవారి ఓట్లతోపాటు డ్యూప్లికేట్, డెత్ ఓటర్లను తొలగించేందుకు ఎన్నికల కమిషన్ ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా ఉండాలనే ఆలోచనతో ఎన్నికల సంఘం చేపడుతున్న ఈ కార్యక్రమం రాజకీయ పార్టీల్లో గుబులు పుట్టిస్తోంది. ఇప్పటివరకు సర్ పూర్తి చేసిన రాష్ట్రాల్లో పార్టీల జాతకాలు తారుమారు కావడంతో రాష్ట్రంలో అధికార, ప్రతిపక్షాలు అలర్ట్ అయ్యాయి. ఈ నెల 15 నుంచి ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ ప్రారంభిస్తున్నారు. నెలరోజుల పాటు ఇంటింటికి వెళ్లి ఓటరు జాబితాను పరిశీలించనున్న అధికారులు వచ్చేనెల 21న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రకటిస్తారు. ఆ తర్వాత అభ్యంతరాలు స్వీకరించి, వాటి పరిశీలన అనంతరం సెప్టెంబరు 22న తుది జాబితాను విడుదల చేస్తారు. స్థానిక ఎన్నికల ముందు రాష్ట్రంలో జరుగుతున్న ఈ ప్రక్రియ రాజకీయ పార్టీలకు ముచ్చెమటలు పట్టిస్తుంది. ముఖ్యంగా విపక్ష వైసీపీ సర్ పై అప్రమత్తంగా ఉండాలని కేడర్ ను అప్రమత్తం చేస్తోంది. ఇప్పటికే అన్ని నియోజకవర్గాల్లో బూత్ లెవల్ ఏజెంట్లకు ఈ కార్యక్రమంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించింది వైసీపీ.

సర్ లో నిజమైన ఓటు ఏ ఒక్కటీ తొలగించకుండా పార్టీ కేడర్ జాగ్రత్తగా ఉండాలని వైసీపీ అధినేత జగన్మోహనరెడ్డి ఇప్పటికే సూచించారు. సర్ లో భారీగా ఓట్లు తొలగించడం వల్ల బెంగాల్, తమిళనాడు ప్రభుత్వాలు అధికారం కోల్పోయిన విషయాన్ని ఆయన ప్రస్తావిస్తూ, రాష్ట్రంలో విపక్షంలో ఉన్నందున వైసీపీ మద్దతుదారుల ఓట్లు తొలగించే కుట్ర జరగొచ్చని సందేహం వ్యక్తం చేశారు. దీంతో వైసీపీ నియోజకవర్గ ఇంచార్జులు ప్రత్యేక సమావేశాలు నిర్వహించి సర్ విధానంపై కేడర్ కు శిక్షణ పూర్తి చేశారు. ఇదే సమయంలో అధికార టీడీపీ సైతం సర్ పై పూర్తిగా ఫోకస్ చేసిందని అంటున్నారు. స్థానిక ఎన్నికల ముందు ఈ అవకాశాన్ని చక్కగా వినియోగించుకోవాలని పార్టీ కేడర్ కు టీడీపీ హైకమాండ్ సూచనలు చేస్తోందని చెబుతున్నారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో బూత్ లెవల్ కమిటీలకు శిక్షణ ఇస్తూ సర్ లో ఏం చేయాలి? ఎలా చేయాలి? అన్న అంశాలపై సూచనలు, సలహాలిస్తున్నట్లు చెబుతున్నారు.

దీంతో రాష్ట్రంలో సర్ ప్రారంభానికి 15 రోజుల ముందే రాజకీయంగా వేడి పెరిగిపోయిందని అంటున్నారు. సర్ ప్రక్రియ వల్ల బెంగాల్ లో దాదాపు 90 లక్షల ఓట్లు తొలగించినట్లు చెబుతున్నారు. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో ఆ రాష్ట్రాన్ని 15 ఏళ్లు పాలించిన మమత బెనర్జీ తట్టాబుట్టా సర్దుకోవడం దేశంలో ఇతర పార్టీలకు ఓ హెచ్చరికగా వ్యాఖ్యానిస్తున్నారు. ఇక తమిళనాడులో సైతం డీఎంకే అధికారం కోల్పోయిన తీరు విపక్ష పార్టీలను భయపెడుతున్నట్లు చెబుతున్నారు. ఈ కారణంగానే ఏపీలో అధికార టీడీపీ కన్నా, విపక్ష వైసీపీ ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటోందని వ్యాఖ్యానిస్తున్నారు.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైం వాయిస్

ఒంగోలులో విషాదం..

## నీటికుంటలో ఈతకు దిగి నలుగురు చిన్నారుల మృతి



**ఒంగోలు, విశ్వం వాయిస్ న్యూస్ :** ఒంగోలు నగర పరిధిలోని చెరువుకొమ్ముపాలెం వద్ద విషాదం చోటుచేసుకుంది. నీటికుంటలో మునిగి నలుగురు చిన్నారులు మృతిచెందారు. చెరువుకొమ్ముపాలెం వద్ద నీటి కుంటలో ఈతకు దిగి చిన్నారులు కరేటి అభిరామ్ (14), కరేటి సుశాంత్ (12), పొదిలి చిన్ను (11), ఇల్లా దినేష్ (10) గల్లంతయ్యారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని స్థానికుల సాయంతో గాలింపు చేపట్టారు. అనంతరం అన్నదమ్ములు అభిరామ్, సుశాంత్‌తో పాటు దినేష్, చిన్ను మృతదేహాలు లభ్యమయ్యాయి. చిన్నారుల మృతితో వారి తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.

## హైదరాబాద్‌లో బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు..


### బీటెక్ విద్యార్థి మృతి

**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో బీటెక్ విద్యార్థి మృతిచెందాడు. సికింద్రాబాద్‌లోని జలమండలి కార్యాలయం వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. మృతుడిని గురునానక్ కళాశాలకు చెందిన విశాల్ మదన్‌గా గుర్తించారు. బైక్‌పై జూబ్లీ బస్‌స్టేషన్ నుంచి ఉప్పల్‌కు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

## కర్ణాటకలో రోడ్డు ప్రమాదం.. కర్నూలు జిల్లాకు చెందిన ముగ్గురు మృతి

**బెంగుళూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు మృతి చెందారు. ఈ విషాదకర ఘటన తుమకూరు జిల్లాలోని చిక్కనాయకనహళ్లి తాలూకా హులియారు వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బళ్లారి-శ్రీరంగ పట్నం జాతీయ రహదారిపై హులియారు వద్ద రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఒక కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో వాహనంలో ప్రయాణిస్తున్న పలువురికి తీవ్రగాయాలైనట్లు పోలీసులు తెలిపారు. మృతులు ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన ప్రముఖ కోళ్ల వ్యాపారి గజేశ్వర్ రెడ్డి, ఆయన భార్య, కుమార్తెగా పోలీసులు గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హులియారు (కర్ణాటక) పోలీసులు తెలిపారు. గజేశ్వర్ రెడ్డి మృతికి సంతాపంగా శుక్రవారం ఆదోని పట్టణంలో చికెన్ దుకాణాలు బంద్ చేసి సంతాపం పాటించనున్నట్లు చికెన్ వ్యాపారులు తెలిపారు.

## భార్యను హతమార్చి.. ఆపై పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయిన భర్త



**మూసాపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** కుటుంబ కలహాల నేపథ్యంలో కత్తితో భార్య గొంతు కోసి హతమార్చాడో కిరాతక భర్త. అనంతరం కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆస్మరా బేగం (24), షేక్ రహీంలకు 2024లో వివాహం జరిగింది. ప్రస్తుతం వారిద్దరూ కుటుంబంతో కలిసి కైతలాపూర్‌లోని ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉంటున్నారు. వీరికి ఏడాదిన్నర కుమారుడు ఉన్నాడు. రహీం ఆటో డ్రైవర్‌గా పనిచేస్తుండగా.. ఆస్మరా బేగం ఇంట్లోనే ఉంటోంది. కాగా వివాహం జరిగినప్పటి నుంచి దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ విషయమై గతంలో దంపతులిద్దరూ వేర్వేరుగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలోనే గురువారం ఉదయం మరోసారి వారి మధ్య గొడవ జరిగింది. దీంతో ఆగ్రహానికి గురైన రహీం కత్తితో భార్య గొంతు కోసి హతమార్చాడు. అనంతరం నేరుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు.

## అమీర్‌పేటలోని షాపింగ్ కాంప్లెక్స్‌లో భారీ అగ్ని ప్రమాదం



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** అమీర్‌పేటలోని ఓ షాపింగ్ కాంప్లెక్స్‌లో గురువారం మధ్యాహ్నం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. మెట్రో పిల్లర్ నెంబరు 1043 సమీపంలోని షాపింగ్ కాంప్లెక్స్ రెండో అంతస్తులో ఉన్న కేఎస్ఆర్ ఫ్యాషన్స్ దుకాణంలో మంటలు చెలరేగాయి. క్రమంగా ఇతర దుకాణాలకూ వ్యాపించాయి. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది 3 ఫైరింజన్లు, 8 వాటర్ ట్యాంకర్లతో మంటలు అదుపు చేశారు. ఇతర దుకాణాల్లోని వారిని ఖాళీ చేయించారు.

## అతికిన ఎముకను మళ్లీ విరగ్గొట్టి..

### లంచం ఇవ్వలేదని బాలికపై వైద్యుడి దారుణం

**విశ్వం వాయిస్ న్యూస్ :** 'వైద్యో నారాయణో హరి' అంటుంటారు. అంటే ప్రాణం పోసే శక్తి ఉన్న వైద్యుడు.. భగవంతుడితో సమానమని అర్థం. అలాంటి పవిత్రమైన వృత్తిలో ఉండి అత్యంత అమానుషంగా ప్రవర్తించాడో వైద్యుడు. కాపాడాల్సిన చేతులతోనే.. ఓ బాలిక కాలికి తీవ్ర గాయం చేశాడు. లంచం ఇవ్వలేదన్న కోపంతో తాను అతికించిన ఎముకను తనే విరగ్గొట్టి పైశాచిక ఆనందం పొందాడు. సభ్య సమాజానికి దిగ్భ్రాంతి కలిగించే ఈ ఘటన ఉత్తరప్రదేశ్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. యూపీలోని ముజఫర్‌పుర్‌కు చెందిన రేష్మకు కొన్నేళ్లక్రితమే భర్త మరణించారు. అప్పటినుంచి తన 14 ఏళ్ల కుమార్తెను ఒంటరిగా పోషిస్తున్నారు. మానసిక స్థితి సరిగా లేని ఆ బాలికకు నెలన్నర కిందట గాయమైంది. ఎడమకాలిలో ఎముక విరగడంతో శస్త్రచికిత్స కోసం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి కుమార్తెను తీసుకెళ్లింది. అయితే, అక్కడ ఆసుపత్రి సిబ్బంది రూ.25వేలు లంచం డిమాండ్ చేశారు. తన ఆర్థిక పరిస్థితి బాగాలేదని, అంత డబ్బు ఇచ్చుకోలేనని చెప్పినా సర్జరీకి వారు ససేమిరా అన్నారు. దీంతో సాయం కోసం రేష్మ జిల్లా మేజిస్ట్రేట్‌ను ఆశ్రయించారు. స్పందించిన యంత్రాంగం.. ఆ బాలికకు ఉచిత చికిత్సను అందించాలని సంబంధిత జిల్లా ఆసుపత్రిని ఆదేశించింది. కానీ, జిల్లా మేజిస్ట్రేట్ ఆదేశాలను హాస్పిటల్ సిబ్బంది పట్టించుకోకుండా.. లంచం ఇవ్వాల్సిందేనని పట్టుబట్టారు. అతి కష్టమ్మీద రేష్మ రూ.8వేలు చెల్లించారు. అనంతరం చతుర్వేది అనే వైద్యుడు ఆ బాలికకు సర్జరీ చేశాడు. మళ్లీ ఆసుపత్రికి వచ్చినప్పుడు మిగతా మొత్తాన్ని చెల్లించాలని కరాఖండీగా చెప్పాడు. అయితే, ఆ డబ్బును రేష్మ ఇవ్వలేకపోవడంతో పరీక్షల కోసం పిలిచి ఆ వైద్యుడు దారుణంగా ప్రవర్తించాడు. బాలిక నడవగలుతుందో, లేదో అని పరీక్షిస్తానంటూ.. ఆమె కాలిని గట్టిగా మెలిపెట్టాడు. ఆ చిన్నారి అరుస్తున్నా వినకుండా కాలిని అటూఇటూ తిప్పుతూ ఎముకను సరిచేస్తున్నానంటూ నమ్మబలికాడు. ఇంటికెళ్లాక కూడా ఆ బాలిక నొప్పితో విలవిల్లాడటంతో.. రేష్మ ఆమెను మరో ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ ఎక్స్‌రే తీయగా ప్రభుత్వాసుపత్రి వైద్యుడి నిర్వాకం బయటపడింది. సర్జరీ చేసి అతికించిన ఎముక మళ్లీ విరిగినట్లు రిపోర్టుల్లో తేలింది. డాక్టర్ ఉద్దేశపూర్వకంగా తన కుమార్తె కాలిని విరగొట్టారంటూ రేష్మ ఆవేదన వ్యక్తంచేశారు. ఆమె బంధువులు దీనిపై నిరసనకు దిగడంతో ముజఫర్‌నగర్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ సదరు వైద్యుడిపై విచారణకు ఆదేశించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని బాధిత కుటుంబానికి హామీ ఇచ్చారు.

## సూడో పోలీస్.. కిడ్నాప్ డ్రామా

### మరోసారి పోలీసులకు చిక్కిన పాత నేరస్థుడు నాగరాజు రఘువర్మ

### జగద్గిరిగుట్టలో వ్యాపారిని బెదిరించిన కేసులో అరెస్టు



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** పోలీసు అధికారిగా చెలామణీ అవుతూ వ్యాపారులను కిడ్నాప్ చేసి డబ్బు వసూలుచేసే కేటుగాడు నాగరాజు రఘువర్మ జైలు నుంచి రాగానే మళ్లీ చీకటి దందా మొదలుపెట్టాడు. జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వ్యాపారిని కిడ్నాప్ చేసి డబ్బు వసూలు చేసిన ఘటనలో తాజాగా పోలీసులకు చిక్కాడు. బుధవారం డీసీపీ కోటిరెడ్డి కేసు వివరాలు వెల్లడించారు.

**హరియాణా పోలీసులమంటూ బెదిరించి..**

జైలు నుంచి విడుదలయ్యాక..అక్కడ పరిచయమైన నిందితులతో కలిసి జట్టుకట్టిన అతను అదే దందాను కొనసాగించాడు. మే 18న హైదరాబాద్ జగద్గిరిగుట్ట పరిధి లేక్‌బజార్ దగ్గర కూకట్‌పల్లికి చెందిన కావూరి పూర్ణచంద్ర రావు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా కారుతో అడ్డగించారు. తాము హరియాణా పోలీసులమని, ఆ రాష్ట్రంలో నమోదైన కేసులో నిందితుడిగా ఉన్నావంటూ పూర్ణచంద్రరావును బెదిరించారు. బలవంతంగా వాహనంలో ఎక్కించుకున్నారు. ఆయన దగ్గరున్న ఫోన్, డెబిట్‌కార్డు, నగదు లాక్కున్నారు. అనంతరం సూర్యాపేటకు తీసుకెళ్లి.. ఆయన బ్యాంకు ఖాతాల నుంచి రూ.5.26 లక్షలు డ్రా చేయించి తీసుకున్నారు. తర్వాత ఆయన్ను దారుణంగా హింసించి..నిర్మానుష్య ప్రాంతంలో వదిలేసి వెళ్లారు. 'ఇదంతా మోసమని తెలుసుకున్న బాధితుడు గత నెల 20న జగద్గిరిగుట్ట ఠాణాలో ఫిర్యాదు చేశారు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు ప్రధాన సూత్రధారి నాగరాజు, అతడికి సహకరించిన యూపీలోని ఆగ్రాకు చెందిన యశ్వంత్‌సింగ్, ప్రదీప్‌కుమార్ మిశ్రా, సత్యబన్‌సింగ్, హైదరాబాద్‌కు చెందిన నాగేంద్రవర్మలను అరెస్టు చేశారు. మరో నిందితుడు సునీల్ పరారీలో ఉన్నాడు' అని డీసీపీ కోటిరెడ్డి వెల్లడించారు.

# విద్యా వాయిస్

## చిక్కు విప్పడానికీ ఓ లెక్క ఉంది



కార్పొరేట్ ఉద్యోగాల్లో విజయం సాధించడం సిలబస్‌లో లేని, కంటికి కనిపించని నైపుణ్యాలపై ఆధారపడి ఉంటుంది. వాటిని ఎక్కడా నేర్చుకోవడం సాధ్యం కాదు. అందువల్ల యువ ఉద్యోగులు నిర్ణయాలు తీసుకోవడం, ఆలోచనలు పంచుకోవడంలో తొందర పడకూడదు. చేసే ప్రతి పనిలోనూ పై స్థాయి వ్యక్తులను భాగస్వామ్యం చేస్తేనే మీ ఆలోచనలకు గుర్తింపు దక్కుతుంది. ఫలితంగా ఉద్యోగంలో ఉన్నతికీ వీలవుతుంది. ప్రతిష్ఠాత్మక కళాశాల నుంచి నవీన్ ఎంబీఏ పూర్తిచేశాడు. ఒక బహుళజాతి సంస్థ నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో ఎంపికయ్యాడు. ఏదైనా సాధించగలననే ఆత్మవిశ్వాసం అతడిలో పుష్కలంగా ఉంది. అయితే ఉద్యోగంలో చేరాక కాలేజీలో చదివిన మార్కెటింగ్ సూత్రాలు, కమ్యూనికేషన్ సిద్ధాంతాలు పునాది మాత్రమే అనే విషయం అర్థమైంది.

### ప్రజ్ఞకూ పరిమితులు

ఆదిత్య ఒక సాఫ్ట్‌వేర్ సంస్థలో ట్రెయినీగా చేరాడు. గణాంకాల విశ్లేషణలో తలెత్తిన సున్నితమైన సమస్య విషయమై బృంద సభ్యులు మేధామథనం చేస్తున్నారు. అతడు తనకున్న పరిజ్ఞానంతో ఒక ప్రోగ్రామ్ డెవలప్ చేశాడు. దాన్ని సమావేశంలో ప్రదర్శించి సమస్య పరిష్కరించాడు. అయితే టీమ్ లీడర్ ఆదిత్యను తన ఛాంబర్‌కు పిలిచి అభినందించడానికి బదులు తన అసహనాన్ని వ్యక్తపరిచి మందలించాడు. ఇలాంటి పరిష్కారాలు సమావేశాల్లో ప్రదర్శించే ముందు తనతో చర్చించాలని, తన అనుమతితో సమీక్షా సమావేశాల్లో మాట్లాడాలని, ఇలా మరోసారి జరగకూడదని హెచ్చరించాడు. కార్పొరేట్ సంస్థల్లో సమస్య పరిష్కారం ఎంత ముఖ్యమో, ఆ పరిష్కారం ఎవరి ద్వారా జరుగుతున్నదన్నదీ అంతే ప్రాధాన్యమైంది. ఉద్యోగిగా మీ సామర్థ్యాలు, నైపుణ్యాలు పై అధికారుల ప్రాధాన్యం తగ్గిస్తున్నాయని, వారిని సవాల్ చేస్తున్నాయని అనిపిస్తే అది మీ మనుగడకే ప్రశ్నార్థకం కావచ్చు.

### తెలివిగా వ్యవహరిస్తేనే

ఒక మార్కెటింగ్ సంస్థలో శిక్షణ అధికారిగా చేరాడు భాస్కర్. ఆ సంస్థ సీఈవో ఒక సమావేశంలో ఉద్యోగులందరూ సమానమేనన్నారు. హైరార్కీకి ప్రాధాన్యం ఉండదనీ చెప్పారు. వ్యయ నియంత్రణకు సంబంధించిన సలహాలు, సూచనలను ఉద్యోగులు ఎలాంటి సంకోచం లేకుండా నేరుగా సీనియర్ మేనేజ్‌మెంట్‌కు తెలియజేయవచ్చనీ అన్నారు. దీన్ని నమ్మిన భాస్కర్ మార్కెటింగ్ శాఖలో 20 శాతం అనుత్పాదక వ్యయం జరుగుతున్నదని, వ్యయ నియంత్రణకు ఒక మంచి ఐడియాతో నేరుగా సీఈవోను కలిశాడు. ఈ ఆలోచన నచ్చిన అతడు భాస్కర్‌ను అభినందించి, దాన్ని అమలు చేయాల్సిందిగా టీమ్ లీడర్‌ను ఆదేశించాడు. భాస్కర్ నేరుగా సీఈవో దగ్గరకు వెళ్లడాన్ని జీర్ణించుకోలేని టీమ్ లీడర్ తీవ్ర అసహనానికి గురయ్యాడు. ఫలితంగా తర్వాతి ఆరు నెలలకు భాస్కర్ పనిచేస్తోన్న శాఖలో ఒంటరివాడై, చివరికి ఉద్యోగానికి రాజీనామా చేయాల్సి వచ్చింది. ఉన్నత స్థాయి యాజమాన్యాలు.. సంస్థలో హోదాలు, 'హైరార్కీ' ముఖ్యం కాదని చెప్పినప్పటికీ పదవీక్రమం ఒక అదృశ్య శక్తి. పై అధికారిని పక్కన పెట్టి నిర్ణయాలు తీసుకోవడమంటే ఉద్యోగ జీవితంలో ఎదుగుదలకు సంకెళ్లు వేసుకున్నట్లే. కొన్నిసార్లు మనుగడా ప్రశ్నార్థకమవుతుంది.

### భాగస్వామ్యం చేయాలి

లాస్య ఒక తయారీరంగ సంస్థలో నాణ్యత-నియంత్రణ విభాగంలో అధికారిగా చేరింది. నాణ్యత ప్రమాణాల్లో తలెత్తిన సమస్యను పరిష్కరించే బాధ్యతను ఆమెకు అప్పగించారు. అందులో కీలకమైన లోపాన్ని పరిష్కరించింది. సమావేశంలో మాట్లాడుతూ.. 'మా టీమ్ లీడర్ మార్గదర్శకత్వంలో ఈ సమస్యను మేము పరిష్కరించాం' అని చెప్పింది. ఈ పరిణామంతో టీమ్ లీడర్ లాస్యకు మరిన్ని అవకాశాలు కల్పించారు. ఫలితంగా ఆమె కొత్త విషయాలెన్నో నేర్చుకోగలిగింది. సంస్థలో ఆమె ఎదగడానికి మార్గం సులువైంది. టీమ్ లీడర్ లాస్యను ప్రమోషన్‌కు సిఫారసు చేశారు.

మీ విజయంలో మీ పై అధికారిని భాగస్వామిని చేయడం వల్ల మీ విలువ పెరుగుతుంది. మీకు మీ టీమ్ లీడర్ నుంచి ఒక శక్తిమంతమైన మద్దతు లభిస్తుంది. ఈ మనోవైఖరి సంస్థలో మీ ఎదుగుదలకు సహకరిస్తుంది.

### తప్పును అంగీకరిస్తేనే

ఎలక్ట్రానిక్స్ పరికరాలు తయారుచేసే సంస్థలో మార్కెటింగ్ అధికారిగా చేరాడు అర్జున్. బృంద సభ్యుల పని తీరు సరిగా లేకపోవడం, సభ్యుల మధ్య సమన్వయ లోపం, వినియోగదారులకు వస్తువు నాణ్యతపై అవగాహన లేకపోవడంతో అమ్మకాలు తగ్గాయి. అయితే ఆ వైఫల్యాలు కప్పిపుచ్చడానికి సాంకేతిక అంశాలపైకి తప్పు నెట్టేసి నివేదిక ఇచ్చాడు. వాస్తవాలు తెలుసుకున్న యాజమాన్యం అతడిని ఉద్యోగం నుంచి తొలగించింది. సమస్యను నిజాయతీగా విశ్లేషించకపోతే తాత్కాలిక రక్షణ లభించినా దీర్ఘ కాలంలో కెరియర్ దెబ్బతింటుంది. కార్పొరేట్ సంస్థల్లో కొలువులు ఆశించేవారు సమస్యా పరిష్కార నైపుణ్యాలను పెంపొందించుకోవాలి. ఉద్యోగార్థుల ఆలోచనా విధానం, సమస్యలను తెలియజేసే తీరును సంస్థలు నిశితంగా పరిశీలిస్తాయి. సమస్యను విభజించి చూడటం, మూల కారణాలను గుర్తించడం, ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించే నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలి. వీటి ద్వారా కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగం సంపాదించడంతో పాటు కెరియర్‌లో ఎదగడానికీ అవకాశం ఉంటుంది. ప్రతి యువ ఉద్యోగార్థీ సమస్యా పరిష్కారంలో కనిపించని కోణాన్ని అర్థం చేసుకోవాలి.

### రానున్న గోదావరి పుష్కరాలను మహా కుంభమేళా తరహాలో

# అత్యంత వైభవంగా నిర్వహిస్తాం

**తక్షణమే పుష్కరాల ఏర్పాట్లకు దేవాదాయ శాఖ బ్లూప్రింట్ సిద్ధం చేయాలి**

**దేవాదాయ శాఖ ఉన్నతాధికారులకు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాలు**



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** రానున్న గోదావరి పుష్కరాలను దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలిచే విధంగా, మహా కుంభమేళా తరహాలో అత్యంత ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. నేడు రాష్ట్ర సచివాలయంలో దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు, ఇంజనీరింగ్ విభాగ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై విస్తృతంగా చర్చించి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. పుష్కరాల నిర్వహణకు సంబంధించి సమగ్ర బ్లూప్రింట్‌ను అత్యవసరంగా సిద్ధం చేసి ముఖ్యమంత్రికి ప్రజెంటేషన్ ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. పుష్కరాల కోసం చేపట్టాల్సిన అన్ని అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించి నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. గోదావరి నది పరివాహక ప్రాంతంలోని ఆరు జిల్లాల్లోని పుష్కర ఘాట్ల నిర్మాణాపు పనులు, మరమ్మతులు, విస్తరణ, పరిశుభ్రత, విద్యుత్, తాగునీరు, పారిశుధ్యం, భక్తుల వసతి, రవాణా తదితర అంశాలపై ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. త్వరలోనే ఆయా జిల్లాల కలెక్టర్లు, స్థానిక శాసనసభ్యులు, సంబంధిత అధికారులతో కలిసి పుష్కర ఘాట్లను స్వయంగా పరిశీలించనున్నట్లు తెలిపారు. ఆరు జిల్లాల దేవాదాయ శాఖ అధికారులు సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో సమన్వయం చేసుకుని ఆలయాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో స్థానిక శాఖల అధికారులతో ప్రత్యేక సమన్వయ సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. పుష్కరాల సందర్భంగా భక్తులకు సాంప్రదాయ, ఆధ్యాత్మిక సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు పిండప్రదాన కార్యక్రమాల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని మంత్రి ఆనం సూచించారు. ఇందుకు అవసరమైన వేద పండితులు, అర్చకులు, బ్రాహ్మణుల సంఖ్యపై అంచనాలు రూపొందించి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే శ్రీవాణి ట్రస్ట్ ద్వారా ఆరు జిల్లాల్లోని ఆలయాల నిర్మాణం, అభివృద్ధికి సంబంధించి స్థానిక శాసనసభ్యుల నుంచి ప్రతిపాదనలు స్వీకరించి వాటిని ప్రాధాన్యత ఆధారంగా అమలు చేయాలని సూచించారు. గోదావరి నది రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఆధ్యాత్మిక వారసత్వానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్న మంత్రి, తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి మరియు అధికారులతో త్వరలో సమావేశమై పరస్పర సహకారంతో ఉభయ రాష్ట్రాల్లో గోదావరి పుష్కరాలను విజయవంతంగా నిర్వహించేందుకు సమన్వయం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. పుష్కరాల నిర్వహణలో పోలీసు, మున్సిపల్, రెవెన్యూ, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్య, రోడ్లు-భవనాలు, విద్యుత్, పర్యాటక తదితర శాఖల మధ్య సమర్థవంతమైన సమన్వయం ఉండాలని, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు ముందస్తుగా పూర్తి చేయాలని మంత్రి స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ మహత్తర ఆధ్యాత్మిక వేడుకలను విజయవంతం చేయడానికి ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని, ప్రతి నెలా గోదావరి పుష్కరాల పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. చేపడుతున్న పనుల పురోగతిపై అధికారులు ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. గోదావరి పుష్కరాలు రాష్ట్ర ప్రతిష్టకు అద్దం పట్టే మహత్తర ఆధ్యాత్మిక ఉత్సవంగా నిలిచేలా ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు చేపడుతోందని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. ఈ సమీక్ష సమావేశంలో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి హరిజవహర్ లాల్, దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్, రాష్ట్ర దేవాలయ పరిపాలన సంస్థ ( శిక్షణ సంస్థ ) ముక్తేశ్వరరావు, అదునపు కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్, దేవదాయ చీఫ్ ఇంజనీర్ శేఖర్, దేవాదాయ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### ఆసుపత్రుల ఆవరణలో

# మొక్కలు నాటాలి

**పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలు జరపాలి**

**వైద్యారోగ్య శాఖా మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ ఆదేశాలు**


**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అన్ని రకాల ఆసుపత్రుల్లో మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలని వైద్యారోగ్య శాఖా మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ, వ్యర్థాల నిర్వహణ, నీటి సంరక్షణ, ఇంధన పొదుపు, ఆరోగ్య సంస్థల్లో సుస్థిర విధానాల అమలుపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆసుపత్రులు, కళాశాలల ఆవరణలో మొక్కల్ని నాటడంతో పాటు అవగాహన సదస్సులు, ఉపన్యాసాలు, ప్రతిజ్ఞ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. నీటి సంరక్షణ, విద్యుత్ పొదుపుపై ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు కూడా చేపట్టాలన్నారు. సిబ్బంది, విద్యార్థులు, రోగులు, వారి సహాయకులు, సందర్శకులకు వీలైనంత మేర మొక్కలను పంపిణీ చేయాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ, సుస్థిర ఆరోగ్య సేవలపై అవగాహన కల్పించే పోస్టర్లు, బ్యానర్లు, ఐఈసీ ప్రచార సామగ్రిని ప్రదర్శించాలని సూచించారు. డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ చక్రధర్ బాబు, వైద్య విద్యా సంచాలకులు (డీఎంఈ) డాక్టర్ విష్ణువర్ధన్ గురువారం వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు. సెకండరీ హెల్త్ శాఖలోని ప్రతి ఉద్యోగి తమ కార్యాలయాలు, ఆసుపత్రుల ఆవరణలో కనీసం ఒక మొక్కను నాటి దాని సంరక్షణ బాధ్యతను స్వీకరించాలని చక్రధర్ బాబు సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సెకండరీ హెల్త్ ఆసుపత్రులు, కార్యాలయాల్లో జూన్ 5న కనీసం 12,500 మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో అధికారులు, సిబ్బంది అందరూ భాగస్వాములు కావాలని కోరారు. మొక్కల మనుగడ శాతం పెరిగేలా అటవీ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని ఆరోగ్యవంతమైన మొక్కల్ని ఎంపిక చేసుకోవాలన్నారు. మొక్కలు నాటే ముందు తగిన పరిమాణంలో గుంతలు తవ్వి, స్థానిక సేంద్రియ ఎరువులతో నింపాలని సూచించారు. అలాగే ప్రభుత్వ వైద్య కళాశాలలు, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రులు, బోధనాసుపత్రులు, ప్రత్యేక వైద్యాసుపత్రులు, ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలు, పాఠశాలల్లో పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని డిఎంఈ డాక్టర్ విష్ణు వర్ధన్ ఆదేశాలు పంపారు. డాక్టర్లు, సిబ్బంది అందరినీ భాగస్వామ్యం చేయాలని ఆయన సూచించారు.

# మైనారిటీల విద్యాభివృద్ధి కోసం కృషి

**చంద్రబాబు హయాంలోనే మైనారిటీల సంక్షేమం**

**మైనారిటీ,న్యాయశాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్**

**ఎస్ఎస్‌సి, ఇంటర్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన మైనారిటీ విద్యార్థులకు సన్మానం**



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** మైనారిటీల విద్యాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ బద్ధంగా కృషి చేస్తున్నదని మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. రాష్ట్రస్థాయిలో పదవ తరగతి, ఇంటర్ విద్యలో అత్యుత్తమ మార్కులు సాధించిన మైనారిటీ విద్యార్థులను గురువారం మంత్రి సన్మానించి ఆశీర్వదించారు. వెలగపూడి సచివాలయం మూడవ బ్లాక్ కాన్ఫరెన్స్ హాల్లో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ విద్య తోనే తాము అనుకున్న ఉన్నత స్థాయికి యువత ఎదిగి దేశ నిర్మాణ ప్రక్రియలో పాలుపంచుకోగలరని అన్నారు. మైనారిటీ కుటుంబాల్లో విద్యార్థుల శ్రేయోభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా అన్ని రకాలుగా ప్రోత్సాహం అందిస్తున్నదని వాటిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఇటీవలనే వక్ఫ్ బోర్డు ద్వారా తాలిం ఏ హునర్ పథకం క్రింద కార్పొరేట్ కళాశాలల్లో ఉచిత రెసిడెన్షియల్ ఇంటర్ విద్య కోసం నిర్వహించిన టాలెంట్ టెస్ట్ లో ప్రతిభగలిగిన 250 మందిని ఎంపిక చేయడం జరిగిందన్నారు. మైనారిటీ కుటుంబాలలోని ప్రతిభావంతులైన విద్యార్థుల కోసం ఉచిత డీఎస్సీ శిక్షణ, పోటీ పరీక్షలకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమం లో మైనారిటీల సంక్షేమ శాఖ ఇంచార్జ్ సెక్రటరీ సూర్య కుమారి, మైనారిటీ కార్పొరేషన్ ఎండి యకూబ్ భాష, క్రిస్టియన్ కార్పొరేషన్ ఎండి శేఖర్, డిడి సరోజినీ, అధికారులు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### మెల్బోర్న్‌లోని విక్టోరియా పార్లమెంట్‌ను

# సందర్శించిన ఎంపీ హరీష్ బాలయోగి



**విశ్వం వాయిస్ న్యూస్ :** ఆస్ట్రేలియాలోని మెల్బోర్న్‌లో ఉన్న విక్టోరియా పార్లమెంటును అమలాపురం ఎంపీ గంటి హరీష్ బాలయోగి సందర్శించి, సమావేశాలను వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశం మరియు ఆస్ట్రేలియాలను కలిపి ఉంచే ఉమ్మడి ప్రజాస్వామ్య విలువలకు ఒక శక్తివంతమైన నిదర్శనమన్నారు. బహుళ సాంస్కృతిక వ్యవహారాల పార్లమెంటరీ కార్యదర్శి, గౌరవనీయులు ఇవాన్ వాల్టర్స్ ఎంపీ; బ్రాడ్‌మీడోస్ రాష్ట్ర సభ్యురాలు, కేథలీన్ మాథ్యూస్-వార్డ్ ఎంపీ; విద్యా, మహిళా మరియు ఒప్పంద శాఖ మాజీ మంత్రి, గౌరవనీయులు నటాలీ హచిన్స్ ఎంపీ; ఆస్ట్రేలియన్ లేబర్ పార్టీ (విక్టోరియా) అధ్యక్షుడు, ఉరోస్ రాసిక్; క్లారిండా రాష్ట్ర సభ్యుడు, మెంగ్ హీంగ్ టక్ ఎంపీ, ఏఎల్‌పి బ్రాడ్‌మీడోస్ శాఖ అధ్యక్షుడు, ప్రవీణ్ కుమార్‌లను కలవడం సంతోషాన్నిచ్చిందన్నారు. బహుళ సాంస్కృతికత, సమాజ ప్రాతినిధ్యం, మరియు విక్టోరియా యొక్క సామాజిక, ఆర్థిక, మరియు పౌర జీవితానికి భారతీయ ప్రవాసులు అందిస్తున్న అమూల్యమైన సహకారంపై తమ అభిప్రాయాలను పంచుకున్నామని, భారతదేశం మరియు ఆస్ట్రేలియా మధ్య శాశ్వత భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో భారతీయ సమాజం కీలక పాత్ర పోషిస్తూనే ఉందని ఎంపీ హరీష్ తెలిపారు.

# కిడ్నీ రోగులకు స్వాంతన

**పరస్పర మార్పిడి (స్వాప్) విధానంలో సమీప బంధువుల నుంచి 'కిడ్నీ'లు స్వీకరించేందుకు మంత్రివర్గం ఆమోదం**

**ప్రస్తుతం కుటుంబ సభ్యుల నుంచి మాత్రమే పొందే అవకాశం**

**కిడ్నీలను తాత, అమ్మమ్మ, నాన్నమ్మలు కూడా ఇవ్వొచ్చు..**

**రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ వెల్లడి**



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** కిడ్నీ(మూత్ర పిండం) బాధిత రోగులకు అవయవ మార్పిడి విషయంలో కూటమి ప్రభుత్వం సానుకూల నిర్ణయాన్ని తీసుకుంది. అవయవాల స్వాప్ (పరసర మార్పిడి) విధానానికి కూటమి ప్రభుత్వం చట్ట బద్ధత కల్పించింది. ఒక కటుంబంలోని దాత మరో కుటుంబంలోని గ్రహీతకు కిడ్నీని ఇచ్చి, బదులుగా వారి రోగికి అవసరమైన కిడ్నీని సదరు కుటుంబం నుంచి తీసుకునే విధానాన్ని 'స్వాప్ డొనేషన్స్ ' గా వ్యవహరిస్తున్నారు. దీనికి అనుగుణంగా కేంద్ర ప్రభుత్వానికి చెందిన హ్యూమన్ ఆర్గాన్ ట్రాన్స్‌ప్రాంటేషన్ యాక్ట్-2011ను రాష్ట్రంలో అమలుచేసేందుకు మంత్రివర్గం గురువారం ఆమోదం తెలిపిందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ నేడొక ప్రకటనలో తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం జీవన్మృతుల అవయదానంను ప్రోత్సహించేందుకు అనేక తీసుకుందని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే తాజా నిర్ణయాన్ని తీసుకున్నామన్నారు. కుటుంబ సభ్యుల్లో ఒకరు ముందుకొచ్చినా కిడ్నీల మార్పిడికి కుదరడంలేదు. ప్రస్తుతం జీవించి ఉన్న కుటుంబ సభ్యుల (తల్లి, తండ్రి, కన్నబిడ్డలు) నుంచి తీసిన మూత్రపిండాలను బాధిత రోగులకు అమరుస్తున్నారు. 1995 నుంచి అమల్లో ఉన్న చట్టాన్ని అనుసరించి ఈ ప్రక్రియ కొనసాగుతోంది. అయితే...ఒక్కోసారి కుటుంబ సభ్యుల నుంచి కిడ్నీలు తీసి, బాధితులకు అమర్చేందుకు చికిత్సపరంగా సాధ్యంకావడంలేదు. రోగి, దాతల(డోనార్స్) బ్లడ్ గ్రూపు మ్యాచ్ కాకపోవడం, ఒకవేళ బ్లడ్ గ్రూపు ఒకటే ఉన్నా కిడ్నీ అవసరమైన బాధితుడు, డోనార్‌కు రోగనిరోధక శక్తి తక్కువగా ఉండడం, ఇతర ప్రమాణాల ప్రకారం.. సాధ్యంకానప్పుడు మార్పిడి జరగడంలేదు. ఈ పరిస్థితుల్లో కిడ్నీ బాధితులకు స్వాంతన చేకూర్చేందుకు కేంద్రం హ్యూమన్ ఆర్గాన్ ట్రాన్సప్లాంటేషన్ యాక్ట్-2011 చట్టం ద్వారా 'పరస్పర మార్పిడి'(స్వాప్) విధానాన్ని అమల్లోనికి తెచ్చింది. దీనిని మంత్రివర్గం ఆమోదం తెలిపినందున ఆర్డినెన్స్ జారీ జరగనుంది. తదనుగుణంగా నిబంధనలు జారీ అవుతాయి.

**తాజా నిర్ణయం ప్రకారం...**


కిడ్నీ బాధితులు కుటుంబ సభ్యుల నుంచి కిడ్నీలు పొందేందుకు శస్త్ర చికిత్సపరంగా(రెండు కుటుంబాల్లో) కుదరదని వైద్యులు నిర్ధారించినప్పుడు..సమీప బంధువుల నుంచి కూడా స్వీకరించొచ్చు. ఇరు కుటుంబాల్లో కిడ్నీ అవసరమైన వారు ఉండాలి. అలాగే కుటుంబ సభ్యుల నుంచి కిడ్నీలు పొందేందుకు వైద్యపరంగా సాధ్యం కానప్పుడే 'పరస్పర మార్పిడి' విధానాన్ని అనుసరించాల్సి ఉంది. ఈ కేసుల్లో పరీక్షల (బ్లడ్ గ్రూపు, ఇతర పరీక్షలు) అనంతరం వైద్యులు ఇచ్చే సలహాలు, సూచనలు అనుసరించి పరస్పర అంగీకారంతో కిడ్నీలు మార్చుకోవచ్చు. ప్రస్తుత విధానంలో మాదిరిగానే సదరు కుటుంబాల వారు జోన్ల వారీగా ఉన్న మెడికల్ బోర్డులకు దరఖాస్తు చేసుకోవాలి. ఆమోదం పొందాలి. రాష్ట్రంలో కిడ్నీల కోసం 'జీవన్ దాన్ ట్రస్ట్ కు ' దరఖాస్తు చేసిన వారు రాష్ట్ర వ్యాప్తంగా 3,634 మంది ఉన్నారు.

**తాత..అమ్మమ్మ, నాన్నమ్మల నుంచి కూడా..**

బాధితులు కిడ్నీ లేదా కాలేయాన్ని తల్లిదండ్రులు, పిల్లల్ల నుంచి మాత్రమే ప్రస్తుతం పొందుతున్నారు. ఈ జాబితాలోనికి తాత, అమ్మమ్మ, నాన్నమ్మలను కూడా చేర్చారు. చిన్న వయస్సు కలిగిన పిల్లలకు ఈ నిర్ణయం ఉపయోగకరంగా ఉంటుంది.

**విడిగా టిష్యూ జాబితా..**

చనిపోయిన వ్యక్తుల నుంచి కార్నియా, నర్వ్, టెండాన్, స్కిన్ అవసరమైన వారికి ఇస్తున్నారు. ఈ కేటగిరి ప్రస్తుతం ఆర్గాన్ డొనేషన్ జాబితాలో ఉంది. వీటిని 'టిష్యూ' జాబితాలోనికి చేర్చారు.

విశ్వంవాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్
కోనసీమ జిల్లా ఎడిషన్

శుక్రవారం, 05 జూన్ 2026
www.viswamvoice.com





# అంధకారంలో వేగయ్యమ్మపేట

## అధికారుల నిర్లక్ష్యమే పాలిట శాపం! - వేగయ్యమ్మపేటలో 'కరెంట్' కష్టాలకు అసలు కారణాలివే..




**వేగాయమ్మపేట, విశ్వం వాయిస్ న్యూస్** : వేగయ్యమ్మపేట వాసులకు విద్యుత్ కోతలు నిత్యకృత్యంగా మారాయి. పగలు, రాత్రి అనే తేడా లేకుండా కరెంట్ ఎప్పుడు పోతుందో ఎప్పుడు వస్తుందో తెలియని అయోమయ స్థితిలో స్థానికులు కాలం వెళ్లదీస్తున్నారు. ఈ చీకటి కష్టాలకు ప్రధాన కారణం వాతావరణమో, సాంకేతిక లోపాలో కాదు.. కేవలం విద్యుత్ శాఖ అధికారుల అలసత్వం, మౌలిక వసతుల లేమి అని క్షేత్రస్థాయి పరిశీలనలో స్పష్టమవుతోంది.

**15 గ్రామాలకు ఒకే ఫీడర్.. ఏ చిన్న లోపం వచ్చినా అంతే!**

ద్రాక్షారామం నుంచి తోటపేట వ్యవసాయ మోటార్ల మీదుగా వేగయ్యమ్మపేట, తూర్పు పొలం, కుందలమ్మ చెరువు, వెంకటాయపాలెం, దాసరపాడు తదితర 15 గ్రామాలకు ఒకే ఫీడర్ ద్వారా విద్యుత్ సరఫరా జరుగుతుండటం అతిపెద్ద లోపం. ఈ సుదీర్ఘమైన లైన్‌లో ఎక్కడ ఏ చిన్న సాంకేతిక లోపం తలెత్తినా క్షణాల్లో ఈ 15 గ్రామాలకు కరెంట్ నిలిచిపోయే దయనీయ పరిస్థితి నెలకొంది.

**చేజారిన సబ్‌స్టేషన్ అవకాశం**

సుమారు 20 నెలల క్రితం ఈ ప్రాంత ప్రజల కష్టాలను తీర్చేందుకు ఒక సబ్‌స్టేషన్ మంజూరైంది. కానీ అధికారుల సరైన చొరవ, పర్యవేక్షణ లేకపోవడం వల్ల ఆ బృహత్తర అవకాశం చేజారిపోయింది. ఆనాడే ఆ సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తయి ఉంటే నేడు ఈ గ్రామాలకు నిరంతర విద్యుత్ సరఫరా అందుబాటులో ఉండేదని ప్రజలు వాపోతున్నారు.

**అటకెక్కిన ఆర్డీఎస్ఎస్ పనులు**
**ఓవర్‌లోడ్‌తో కాలిపోతున్న వైర్లు**

గృహ, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను వేరు చేసే ఆర్డీఎస్ఎస్ పనులు ద్రాక్షారామ పరిధిలోని ఇతర సెక్షన్లలో చకచకా పూర్తయినా వేగయ్యమ్మపేటలో మాత్రం ఇంకా ప్రారంభానికి నోచుకోలేదు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా కనీస స్పందన కరువైంది. మరోవైపు మారుతున్న కాలానికి అనుగుణంగా గ్రామాల్లో ఏసీలు, ఫ్రిజ్‌లు, గీజర్లు, ఇన్వర్టర్ల వాడకం భారీగా పెరిగింది. విద్యుత్ వినియోగం పెరిగినా దానికి తగ్గట్టుగా ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచకపోవడంతో పాత సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్ల పైనే సుమారు 20కి పైగా ఇళ్ల భారం పడుతోంది. దీంతో అవి పదేపదే ఓవర్ లోడ్ అయ్యి ట్రిప్ అవ్వడం ఫ్యూజులు కాలిపోవడం నిత్యకృత్యంగా మారింది. దీనికి తోడు పాత వైర్లు (కేబుల్స్) ఓవర్‌లోడ్ కారణంగా తరచూ హీట్ ఎక్కువై కాలిపోతున్నాయి. అధికారుల నిర్లక్ష్యంపై గౌరవ మంత్రివర్యులు కూడా పలుసార్లు హెచ్చరించినా ఫలితం శూన్యంగానే మిగిలిందని ప్రజలు మండిపడుతున్నారు.

**పరిష్కారం దిశగా ప్రజల డిమాండ్లు**

ప్రజలకు నిరంతర విద్యుత్ అందించాలంటే ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ఈ క్రింది చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు

1.ఆర్డీఎస్ఎస్ పనుల ప్రారంభం: నిలిచిపోయిన ఆర్డీఎస్ఎస్ పనులను తక్షణమే ప్రారంభించి వేగవంతం చేయాలి.

2.త్రీ-ఫేస్ (3-ఫ్రాష్టుంవ) సిస్టమ్ ఏర్పాటు: పెరిగిన విద్యుత్ వినియోగాన్ని తట్టుకునేలా సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో త్రీ-ఫేస్ సిస్టమ్‌ను, కొత్త లైన్లను ఏర్పాటు చేయాలి.

3.ఫీడర్ల విభజన: 15 గ్రామాల లోడును విభజించి, అదనపు ఫీడర్ల ద్వారా విద్యుత్ పంపిణీకి ప్రత్యామ్నాయ మార్గాలు ఆలోచించాలి.

వ్యవస్థలోని ఈ సాంకేతిక, మౌలిక లోపాలను సరిదిద్ది తమ కష్టాలు తీర్చాలని వేగయ్యమ్మపేట ప్రజలు కోరుతున్నారు. విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి శాశ్వత పరిష్కారం చూపుతారని ఎదురు చూస్తున్నారు.

# ప్రత్యేక సమగ్ర సవరణతో పారదర్శక ఓటరు జాబితా లక్ష్యం : కలెక్టర్



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్** : భారత ఎన్నికల సంఘం ఓటర్ల జాబితాను పూర్తి స్థాయిలో ఆధునీకరించేందుకు, పారదర్శకంగా మార్చేందుకు ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని చేపట్టిందని జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ తెలిపారు. ఈ ప్రక్రియ ద్వారా ఎన్నికల నిర్వహణ మరింత సులభతరంగా మారుతుందని ఆయన పేర్కొన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా వ్యాప్తంగా ఉన్న నియోజకవర్గ ఎన్నికల అధికారులు, వివిధ మండలాల డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఎన్నికల నిర్వహణ సిబ్బందితో సమావేశం నిర్వహించి ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ అమలు తీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల సంఘం రూపొందించిన డేటా విశ్లేషణను టెక్నికల్ అసిస్టెంట్లు, బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని ఆదేశించారు. 2002 నాటి డేటాను డౌన్‌లోడ్ చేసుకుని బీఎల్‌వో యాప్ మ్యాపింగ్‌పై సాంకేతికంగా అధ్యయనం చేయాలన్నారు. బీఎల్‌వోలు, ఈసీఐ యాప్, పోర్టల్ విశ్లేషణ, ఓపెన్ అంశాలపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. జిల్లాలోని ఆరు నియోజకవర్గాల సిబ్బందికి రెండు రోజులపాటు సాంకేతిక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మ్యాపింగ్ రూపకల్పనలో సాంకేతికంగా మరింత బలోపేతం కావాలన్నారు. జిల్లా ఎన్నికల అధికారి సహా ఇతర ఎన్నికల అధికారుల లాగిన్‌లలో ఉన్న అంశాలను అధ్యయనం చేయాలని సూచించారు. బీఎల్‌వోల నుంచి ఉన్నత స్థాయి అధికారుల వరకు ప్రతి ఒక్కరికీ సవరణ ప్రక్రియపై స్పష్టమైన అవగాహన ఉండాలన్నారు. తొలి దశలో చేపట్టిన మ్యాపింగ్‌కు సంబంధించిన డెస్క్ ఎక్సర్‌సైజ్‌ను పూర్తి చేసి స్పష్టమైన నివేదిక సమర్పించాలని ఆదేశించారు. 2002 నాటి ఓటర్ల జాబితా వివరాలను 2025 జాబితాతో పోల్చి నమోదు చేయాలని తెలిపారు. నియోజకవర్గ ఈఆర్వోలు, బూత్ స్థాయి అధికారులతో ప్రతిరోజూ టెలీకాన్ఫరెన్స్ నిర్వహిస్తూ 100 శాతం పురోగతి సాధించాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ వైఖోం నైదియాదేవి మాట్లాడుతూ, ఎన్నికల సంఘం ప్రత్యేక ముమ్మర సవరణ కార్యక్రమం మూడో దశను అధికారికంగా ప్రారంభించిందన్నారు. 18 సంవత్సరాలు పూర్తి చేసుకుని ఇంకా ఓటరు జాబితాలో పేరు నమోదు కాని అర్హులను గుర్తించి చేర్చడం, పేర్లు, వయస్సు, చిరునామా, ఫోటోలు తదితర వివరాల్లో ఉన్న తప్పులను సరిదిద్దడం, ఒకే వ్యక్తికి వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న ద్వంద్వ నమోదులను తొలగించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. మరణించిన వారు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి పేర్లను జాబితా నుంచి తొలగించి ఓటరు జాబితాను పరిశుభ్రంగా రూపొందిస్తామని చెప్పారు. సాధారణ సవరణలతో పోలిస్తే ఈ ప్రత్యేక ముమ్మర సవరణలో బూత్ స్థాయి అధికారులు నేరుగా ఓటర్ల ఇళ్లకు వెళ్లి వివరాలను సేకరిస్తారన్నారు. ప్రతి ఇంటిని కనీసం మూడు సార్లు సందర్శించి ఓటర్ల వివరాలను ధృవీకరిస్తారని తెలిపారు. ఎన్యుమరేషన్ ఫారాలను ఓటర్లకు అందజేసి, వారు తమ వివరాలను పరిశీలించి సంతకం చేసి తిరిగి ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఈ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా సాగేందుకు రాజకీయ పార్టీలు నియమించే బూత్ స్థాయి ఏజెంట్లు కూడా భాగస్వాములు కావాలని కోరారు. ఓటర్లు తమ పేరు ఓటరు జాబితాలో ఉందో లేదో పరిశీలించుకోవడానికి లేదా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించడానికి ఎన్నికల సంఘం అధికారిక పోర్టల్‌ను ఉపయోగించవచ్చని తెలిపారు. ఏవైనా సందేహాలు లేదా ఫిర్యాదులు ఉంటే జాతీయ టోల్‌ఫ్రీ నంబర్ 1950కు కాల్ చేసి సహాయం పొందవచ్చన్నారు. ఈ సవరణ ద్వారా తుది ఓటరు జాబితా పూర్తిస్థాయిలో పారదర్శకంగా, ఖచ్చితత్వంతో రూపొందించబడుతుందని పేర్కొన్నారు. పరిశుభ్రంగా రూపొందించిన ఓటరు జాబితా ఆధారంగా భవిష్యత్తులో నిర్వహించే ఎన్నికలు మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు అవకాశం కలుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్వో వి.సుబ్బారావు, ఈఆర్వోలు జి.మమ్మీ, జీవీవీ సత్యనారాయణ, డి.రాంబాబు, రెవెన్యూ సిబ్బంది, సాంకేతిక సిబ్బంది పాల్గొన్నారు.

# మంత్రి సుభాష్‌ను విమర్శించే స్థాయి 'పిల్లి'కి లేదు

## నిరాధారమైన ఆరోపణలపై మండిపడ్డ కూటమి నేతలు



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్** : రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఆయన తండ్రి, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ వ్యవస్థాపకులు వాసంశెట్టి సత్యంపై వైసీపీ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాశ్‌రావు చేసిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని కూటమి (టీడీపీ, జనసేన, బీజేపీ) నాయకులు తీవ్రంగా మండిపడ్డారు. గురువారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సంయుక్త విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్రంలో సాగుతున్న కూటమి ప్రభుత్వ పాలనను నియోజకవర్గంలో మంత్రి సుభాష్ కుటుంబం అందిస్తున్న సేవలను చూసి ఓర్వలేకనే వైసీపీ నేతలు అసత్య ప్రచారాలకు పాల్పడుతున్నారని వారు విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేస్తున్న ప్రభుత్వంపై ప్రజల్లో అపోహలు కల్పించే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రజలు స్వచ్ఛందంగా వైసీపీ పాలనను తిరస్కరించి కూటమికి అధికారం అప్పగిస్తే, దానిని "వెన్నుపోటు దినం"గా వైసీపీ నేతలు అభివర్ణించడం ప్రజా తీర్పును అవమానించడమేనని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విమర్శలు చేసే ముందు వైసీపీ తమ పాలనలో జరిగిన "గొడ్డలిపోటు రాజకీయాల" గురించి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో కల్తీ మద్యం, అక్రమ మైనింగ్, అప్పుల భారం కారణంగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పూర్తిగా దెబ్బతిందని కనీస మౌలిక సదుపాయాలు కూడా కల్పించకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేశారని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంపై నమ్మకంతోనే ప్రజలు కూటమికి పట్టం కట్టారని స్పష్టం చేశారు. రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో డయాలసిస్ యూనిట్ నిర్మాణం కోసం మంత్రి సుభాష్ చొరవతో రూ.16 లక్షల సీఎస్ఆర్, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ నిధులు సమకూర్చారని కూటమి నేతలు స్పష్టం చేశారు. ఈ భవన నిర్మాణానికి అడ్డుగా ఉన్న ఒక చిన్న టేకు చెట్టును అధికారుల అనుమతులతోనే తొలగించారని వాస్తవాలు తెలుసుకోకుండా కేవలం రాజకీయ ప్రచారం కోసం ఆరోపణలు చేయడం వైసీపీ నేతల బాధ్యతారాహిత్యానికి నిదర్శనమన్నారు. అక్రమంగా కలప తరలింపు జరిగి ఉంటే బాధ్యత గల నాయకులుగా వెంటనే ఫిర్యాదు ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకంగా చేపడుతున్న డీఎస్సీ నియామకాలపై తప్పుడు ఆరోపణలు చేస్తూ యువత భవిష్యత్తుతో రాజకీయాలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. గత రెండేళ్లలో రామచంద్రపురం నియోజకవర్గంలో సుమారు రూ.240 కోట్లతో పట్టణంలో రూ.40 కోట్లతో రహదారులు, తాగునీరు, డ్రైనేజీ, వైద్య, విద్యా రంగాల్లో గణనీయమైన అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని నాయకులు వివరించారు. పదిమందికి సహాయం చేయడం మంత్రి సుభాష్ కుటుంబానికి నిత్యకృత్యమని ఫౌండేషన్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నారని అలాంటి సేవాదృక్పథం ఉన్న నాయకులపై ఆధారాలు లేని ఆరోపణలు, వ్యక్తిగత విమర్శలు చేయడం మానుకోవాలని హెచ్చరించారు. వైసీపీ నేతలు తమ స్థాయి మరచి మాట్లాడొద్దని ప్రజల తీర్పును గౌరవిస్తూ నిర్మాణాత్మక రాజకీయాలు చేయాలని సూచించారు. ఈ మీడియా సమావేశంలో పట్టణ టీడీపీ అధ్యక్షులు ఉండవల్లి శివ, జనసేన అధ్యక్షులు గొల్లపల్లి కృష్ణ, బీజేపీ నాయకులు కొట్టువాడ హరిబాబు, పార్టీ సీనియర్ నాయకులు గరికపాటి సూర్యనారాయణ, కంచుమర్తి బాబురావు, బీసీ సెల్ నాయకులు దంగేటి గౌరీశంకర్, లంక శ్రీను, పట్టణ యువత అధ్యక్షులు కుడుపూడి ఫణితేజ, సీనియర్ నాయకులు కొమరిన వీర్రాజు, చందమామ వాసు, కట్టా నాగేశ్వరరావు, శ్రీహరి పంతులు, దిగుమర్తి వీరబాబు, వజ్రపు రాజేశ్వరి, దోమ్మలపాటి విజయలక్ష్మి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పాత విభేదాల నేపథ్యంలో యువకుడిపై దాడి - కేసు నమోదు



**అంబాజీపేట, విశ్వం వాయిస్ న్యూస్** : అంబాజీపేట మండలంలో పాత విభేదాల కారణంగా ఓ యువకుడిపై మరో యువకుడు దాడి చేసిన ఘటన కలకలం రేపింది. పోలీసుల వివరాల ప్రకారం, స్థానిక హడ్కో కాలనీకి చెందిన దొండపూడి సిద్ధూ మరియు తొండవరం గ్రామానికి చెందిన చెందిన గోసంగి ధరణీకుమార్‌ల మధ్య గత కొంతకాలంగా విభేదాలు ఉన్నట్లు తెలిపారు. ఈ క్రమంలో జూన్ 3వ తేదీ రాత్రి వకలగరువు బ్రిడ్జి సమీపంలో ధరణీకుమార్‌పై దొండపూడి సిద్ధూ వెనుక నుంచి దాడి చేయడంతో ఆయనకు గాయాలయ్యాయి. గాయపడిన ధరణీకుమార్‌ను స్థానికులు వెంటనే అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించగా, అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం శ్రీనిధి ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు అంబాజీపేట ఎస్సై షేక్ సుభాని తెలిపారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు సేకరిస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

# అమలాపురంలో జంట వంతెనల నిర్మాణ పనుల పరిశీలన

## ట్రాఫిక్ సమస్యల శాశ్వత పరిష్కారమే లక్ష్యం : ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్** : అమలాపురం పట్టణ అభివృద్ధిలో కీలకంగా మారనున్న జంట వంతెనల నిర్మాణ పనులను స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు గురువారం సాయంత్రం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పట్టణంలోని పరంజ్యోతి పబ్లిక్ స్కూల్ ఎదురుగా, నల్లా గార్డెన్ ప్రాంతాన్ని అనుసంధానం చేస్తూ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న జంట వంతెనల పనుల పురోగతిని అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బందితో కలిసి సమీక్షించారు. విత్తనాల వారి కాలువకు ఇరువైపులా ఉన్న గట్లను అనుసంధానం చేసే ఈ వంతెనల నిర్మాణం వల్ల పట్టణంలో రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడటంతో పాటు ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. నిర్మాణ పనుల నాణ్యత, పురోగతి, పూర్తి చేయాల్సిన గడువు తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ విత్తనాల వారి కాలువ అసలు రూపకల్పన ప్రకారం 108 లింకులు, అంటే సుమారు 93 అడుగుల వెడల్పుతో ఉండాల్సి ఉన్నప్పటికీ, సంవత్సరాలుగా జరిగిన ఆక్రమణల కారణంగా ప్రస్తుతం 30 అడుగుల వెడల్పు కూడా లేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాలువ పరిరక్షణతో పాటు ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. అందులో భాగంగా నల్లా గార్డెన్ వైపున ఉన్న గట్టును 30 అడుగుల వెడల్పుతో విస్తరించి, అక్కడి నుంచి కూరసాల వారి వీధి మీదుగా రాఖీ ఎవెన్యూ సెంటర్ వరకు అనుసంధానం చేసే విధంగా రహదారి అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. దీంతో పట్టణంలోని ప్రధాన ప్రాంతాల మధ్య రాకపోకలు మరింత సులభతరం అవుతాయని పేర్కొన్నారు. అదేవిధంగా ప్రస్తుతం ఆక్రమణలకు గురైన కాలువ ఎడమ గట్టును కూడా 30 అడుగుల వెడల్పుతో అభివృద్ధి చేసి నూతన రహదారిగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. ఈ రహదారిని చిందాడగరువు ప్రాంతం వద్ద జాతీయ రహదారికి అనుసంధానం చేయనున్నట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే పట్టణంలో ట్రాఫిక్ ఒత్తిడి తగ్గడమే కాకుండా, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా రవాణా వ్యవస్థ బలోపేతం అవుతుందని వివరించారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే తన లక్ష్యమని పేర్కొన్న ఎమ్మెల్యే ఆనందరావు, పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ట్రాఫిక్ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించడంతో పాటు అభివృద్ధి పనులను వేగవంతం చేయడానికి అన్ని శాఖల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ పరిశీలన కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజల ఆశీస్సులే కూటమి ప్రభుత్వానికి శ్రీరామరక్ష

## ఘనంగా "ప్రజా తీర్పు" విజయోత్సవం




**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్** : పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో 'ప్రజా తీర్పు' దినం సందర్భంగా ఘనంగా విజయోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు కేక్ కట్ చేసి, స్వీట్లు పంచుకొని ప్రజాస్వామ్య విజయాన్ని ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ.. సరిగ్గా రెండేళ్ల క్రితం ఇదే రోజున ఆంధ్రప్రదేశ్ ప్రజలు విధ్వంసకర, కక్షపూరిత పాలనకు ముగింపు పలికి ప్రజాస్వామ్యానికి పట్టం కట్టారని గుర్తుచేశారు. ప్రజల ఆకాంక్షలు, అభివృద్ధి పట్ల ఉన్న ఆశయాలు ఘన విజయం సాధించిన చారిత్రాత్మక రోజు ఇదని ఆయన అభివర్ణించారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందని కనీసం రాజధాని కూడా లేని పరిస్థితికి రాష్ట్రాన్ని నెట్టివేసి అభివృద్ధిని పూర్తిగా అడ్డుకున్నారని ఆయన విమర్శించారు. అయితే, ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అమరావతిని ప్రపంచ స్థాయి రాజధానిగా తీర్చిదిద్దే పనులు శరవేగంగా సాగుతున్నాయని "మా రాజధాని అమరావతి" అని ప్రతి ఆంధ్రుడు గర్వంగా చెప్పుకునే రోజులను సీఎం చంద్రబాబు తీసుకొచ్చారని సంతోషం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేస్తూ సంక్షేమం మరియు అభివృద్ధికి సమాన ప్రాధాన్యత ఇస్తోందని స్పష్టం చేశారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తున్న ఈ ప్రజా ప్రభుత్వాన్ని చూసి ఓర్వలేక వైసీపీ నేతలు అసత్య, విష ప్రచారాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సైతం సీఎం, డిప్యూటీ సీఎంల ఆశయాలకు అనుగుణంగా నియోజకవర్గంలో జనరంజక పాలన అందిస్తున్నారని ప్రశంసించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఇచ్చిన ఈ చారిత్రాత్మక తీర్పు కూటమి ప్రభుత్వ బాధ్యతను మరింత పెంచిందని రాష్ట్రాన్ని దేశంలో అగ్రగామిగా నిలపడానికి ఇదే స్ఫూర్తితో ముందుకు సాగుతామని ఉద్ఘాటించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రజల సహకారం, ఆశీర్వాదాలు ఎల్లప్పుడూ ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఉండవెల్లి శివతో పాటు కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# విజయవంతంగా ముగిసిన 44వ జాబ్ మేళా



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్** : రామచంద్రపురం నియోజకవర్గంలో నిరుద్యోగ నిర్మూలనే లక్ష్యంగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఉపాధి భవన్‌లో ప్రతి వారం నిర్వహిస్తున్న జాబ్ మేళా విజయవంతంగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా తాజాగా నిర్వహించిన 44వ జాబ్ మేళాలో ఇంటర్వ్యూలకు హాజరైన వారిలో మొత్తం 46 మంది అభ్యర్థులు వివిధ ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వివిధ కంపెనీలకు చెందిన హెచ్‌ఆర్ ప్రతినిధులు నవీన్ కుమార్, గంగరాజుల ఆధ్వర్యంలో ఈ ఇంటర్వ్యూలను పారదర్శకంగా నిర్వహించారు. ఈ జాబ్ మేళా ద్వారా ఏజీ ఇండస్ట్రీస్‌కు 20 మంది, డైకిన్ కంపెనీకి 13 మంది, బ్లింకిట్ కంపెనీకి 6 గురు, టాటా ఎలక్ట్రానిక్స్‌కు ముగ్గురు, ఫాక్స్‌కాన్‌కు ఇద్దరు, ఈ-ప్యాక్ మరియు ఎన్ఎస్ఎస్ కంపెనీలకు ఒక్కొక్కరు చొప్పున అభ్యర్థులు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. స్థానికంగానే ఇంటర్వ్యూలు నిర్వహించి తమకు ఉపాధి అవకాశాలు కల్పించిన సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ వ్యవస్థాపకులు వాసంశెట్టి సత్యం, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఉపాధి భవన్ అధినేత రామ్ కుమార్‌లకు ఎంపికైన అభ్యర్థులందరూ ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.





# ఉపాధ్యాయులు అంకితభావంతో బోధించాలి

## నేర్చుకున్న అంశాలను బడిలో అమలు పరచాలి : జిల్లా విద్యాశాఖ అధికారి పిల్లి రమేష్



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రభుత్వ విద్యా రంగంలోని ప్రాథమిక పాఠశాలల తరగతుల్లో విద్యార్థుల విద్యాభ్యాసం బలంగా కొనసాగాలంటే ఉపాధ్యాయులు అందరూ అంకితభావంతో కష్టపడి అంకితభావంతో బోధించాలని కాకినాడ జిల్లా విద్యాశాఖ అధికారి పిల్లి రమేష్ పిలుపును ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు 1, 2వ తరగతులకు బోధించే ఉపాధ్యాయులకు నుండి 9 వ తేదీ వరకు ఆరు రోజుల పాటు వృత్యంతర శిక్షణ ఇస్తున్నామని ఆయన వెల్లడించారు. తమ వృత్తిలో కొనసాగుతూ, తమ నైపుణ్యాలను, జ్ఞానాన్ని మరింత పెంపొందించు కోవడానికి కనీస అభ్యసన స్థాయిలపై ఈ వృత్యంతర శిక్షణ ఇస్తున్నామన్నారు. మారుతున్న కాలం, సాంకేతికతకు అనుగుణంగా ఉద్యోగుల పనితీరును మెరుగు పరచడం ఈ వృత్యంతర శిక్షణ ముఖ్య ఉద్దేశంగా రమేష్ వివరించారు. 4 నుండి 9 వ తేదీ వరకు ఆరు రోజుల పాటు ఇచ్చే ఉపాధ్యాయులకు కనీస అభ్యసన స్థాయిలపై వృత్యంతర శిక్షణ మొదటి రోజు కార్యక్రమాన్ని శంఖవరం మండలం కత్తిపూడిలోని జిల్లా ప్రజా పరిషత్తు ఉన్నత పాఠశాలలో గురువారం మధ్యాహ్నం ప్రారంభించారు. ఈ శిక్షణలో తుని, ప్రత్తిపాడు నియోజక వర్గాలకు సంబంధించి శంఖవరం, ప్రత్తిపాడు, రౌతులపూడి, తుని, కోటనందూరు, తొండంగి మండలాలకు చెందిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు 300 మంది పాల్గొనాల్సి ఉండగా వీరిలో 243 మంది పాల్గొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన రమేష్ శిక్షార్థులైన ఉపాధ్యాయులను ఉద్దేశించి ప్రసంగించారు. వృత్తి నైపుణ్యాలు మెరుగుపరుచు కోవడానికి విద్యార్థులకు అర్థమయ్యేలా సులభకరమైన బోధ న విధానాలు అమలు పరచడానికి ఈ వృత్యంతర శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల పట్ల సాధారణ ఉపాధ్యాయులకు కూడా అవగాహన కల్పించాలని, అన్ని సౌలభ్యాలను అందించేందుకు గాను నిబద్ధతతో పని చేయాలని సూచించారు. గైర్హాజరైన వారిని వెంటనే హాజరుకు ఆదేశిస్తు తగు చర్యలు చేపట్టాలని డీఈఓ సూచించారు. ఈ ఆరు రోజుల శిక్షణలో నేర్చుకున్న అంశాలను పాఠశాలల్లో అమలు పరచాలని ఆదేశిస్తూ ఫౌండేషనల్ లిటరసీ, న్యూమరసి శిక్షణ ఆవశ్యకతను జిల్లా విద్యాశాఖాధికారి పిల్లి రమేష్ వివరించారు. ఉపాధ్యాయులు అంకితభావంతో బోధించడం వలన పేద, బలహీన వర్గాల పిల్లలకు మంచి భవిష్యత్తు లభిస్తుందని, సమర్ధవంతమైన బోధన ద్వారా ప్రభుత్వ బడులు బలోపేతం అయ్యేలా చూడాలని, ప్రభుత్వ ఆదేశాలు ప్రకారం పాఠ్యాంశాలు సకాలంలో పూర్తి చేయాలని, వెనుకబడిన విద్యార్థులకు అదనపు సమయంలో తగిన తర్ఫీదు ఇచ్చి, వారిలో అభ్యసన స్థాయి మెరుగయ్యే వరకూ నిరవధికంగా కృషి చేయాలని ఆయన ఉపాధ్యాయులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంఈఓలు ఎస్వీ.రమణ, టి.గోవింద్, స్థానిక జిల్లా ప్రజా పరిషత్తు ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు ఆర్.ఎస్.లింగేశ్వర రావు, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

### ఉపాధి హామీ శ్రామికుల వెతలపై

# కాంగ్రెస్ పార్టీ దృష్టి

## గ్రామ గ్రామాన సమస్యలు తెలుసుకున్న ఉమ్మడి – ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఉపాధి శ్రామిక మృతుని కుటుంబం పరామర్శ





**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రతిపాడు నియోజకవర్గం ప్రత్తిపాడు మండలంలోని మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను నియోజకవర్గ జాతీయ కాంగ్రెస్ పార్టీ గురువారం పరిశీలించింది. పార్టీ ఇంచార్జ్ ఉమ్మిడి వెంకట్రావు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణుల బృందం ప్రత్తిపాడు మండలంలోని ధర్మవరం, ఒమ్మంగి, ఉత్తరకంచి, లంపకలోవ గ్రామాల్లోని ఉపాధి హామీ పథకం పనులు పరిశీలించింది. 2026 ఉపాధి హామీ పథకంలోని శ్రామికుల హక్కులు, విధులు, వారికి కల్పించిన పని దినాల గురించి వేతనదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా బృందం కొన్ని విషయాలను గుర్తుంచింది. ధర్మవరం గ్రామంలో ఉపాధి హామీ శ్రామికులకు పనికి తగ్గ వేతనం రావడం లేదని, ప్రభుత్వం చెల్లిస్తున్న వేతనం గిట్టుబాటు కావడం లేదని తెలిపారు. ఒమ్మంగి గ్రామంలో ఉపాధి హామీ పథకానికి సంబంధించిన పనుల కొరకు పని ముట్లు గానీ, పని దినాలు కానీ సరిగ్గా లేవని శ్రామికులు వెల్లడించారు. ఉత్తరకంచి గ్రామంలో ఉపాధి హామీ పథకం జాబ్ కార్డులు లేక ఉపాధి శ్రామికులు ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. పని శ్రామికులకు గునపం, పారా, కత్తులు వంటి పని ముట్లను సమకూర్చడం లేదు. అలాగే ఉపాధి హామీ పనుల దగ్గర వయో వృద్ధులు, శ్రామికుల పిల్లలకు, అస్వస్థతకు గురయ్యిన వారికి టెంటులు, తాగు నీరు వంటి ప్రాథమిక సౌకర్యాలను కల్పించిన దాఖలాలు లేవు. 3 వ తేదీన లంపకలోవ గ్రామ ఉపాధి హామీ పని ప్రదేశంలో పని చేస్తూనే శ్రామికుడు లింగంపల్లి వీరభద్రరావు వడ దెబ్బకు గురై స్పృహ కూలిపోయి ప్రాణాలు విడిచారు. వారి కుటుంబాన్ని పరామర్శించి వారికి ప్రభుత్వం నుండి రావలసిన లబ్ది చేకూరేలా ప్రభుత్వంతో మాట్లాడతామని ఆ కుటుంబానికి నియోజకవర్గం భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఉమ్మడి వెంకటరావు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ పిసిసి సభ్యులు ధర్నాలకోట శ్రీను, నాయకులు రామకుర్తి సూర్యనారాయణ, దొడ్డిపట్ల సుబ్బరాజు, కొప్పన కోటేశ్వరరావు, ధోని వెంకటేశ్వర్రావు, దొంతంశెట్టి చంద్రశేఖర్, పెద్దిరెడ్డి వీరబాబు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలకు 'డొక్కా సీతమ్మ ఆసరా'

## రామచంద్రపురం నియోజకవర్గంలో నిత్యావసర సరుకుల పంపిణీ



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జ్, శ్రీ పోలిశెట్టి లక్ష్మీసుబ్బారావు మెమోరియల్ ఛారిటబుల్ ఫౌండేషన్ ట్రస్ట్ ఛైర్మన్ పోలిశెట్టి చంద్రశేఖర్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలో సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. శ్రీ పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో ట్రస్ట్ ద్వారా అమలు చేస్తున్న 'శ్రీమతి డొక్కా సీతమ్మ ఆసరా పథకం' కింద గురువారం (జూన్ 4) పలువురు మృతుల కుటుంబాలకు అండగా నిలుస్తూ నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాలు, గ్రామాల్లో ఇటీవల మరణించిన వారి కుటుంబ సభ్యులను జనసేన నాయకులు నేరుగా వెళ్లి పరామర్శించి ట్రస్ట్ తరపున ఈ సాయం అందించారు. కె.గంగవరం మండలానికి చెందిన తిరుకోటి సుధీర్ రాజ్ (రాజవేరు), కొండేపూడి కమల్, కొండేపూడి సత్యవతి (శేరీలంక), అలాగే కాజులూరు మండలానికి చెందిన పొలుగుమాటి గంగాభవాని (పొలమూరుపాడు), బత్తుల చంద్రరావు, పల్లెటి నాగమణి, ఊబ నూకాలమ్మ, పంతగడ నేరెళ్ళు (నామవారిపాలెం), ఖండవల్లి మరియమ్మ (దుగ్గుదురు), పోతుల బయ్యమ్మ (తర్లంపూడి), లంక శాఖి (జగన్నాథగిరి) కుటుంబాలకు నాయకులు నిత్యావసరాలు అందజేశారు. వీరితో పాటు రామచంద్రపురం మండలానికి చెందిన చిల్లా అప్పయ్యమ్మ (పెయ్యలపేట), కత్తుల సత్యనారాయణ, పలివెల సునీల్ కుమార్ (ఓదూరు), చిలకల లక్ష్మి (నరసాపురపేట), కొప్పుల శ్రీనివాసరావు (అగ్రహారం), జుత్తుగా వెంకటరావు (చోడవరం), పలివెల చిన కాసులు (వెలంపాలెం) కుటుంబాలను పరామర్శించారు. రామచంద్రపురం పట్టణ పరిధిలోని పెందుర్తి సారమ్మ (స్టీల్ వెల్ పేట), కొత్తూరి పాప (రాజబాబు నగర్) కుటుంబ సభ్యులకు కూడా సరుకులు అందజేశారు. ఈ సేవా కార్యక్రమంలో జనసేన పార్టీ మండల వైస్ ప్రెసిడెంట్, నియోజకవర్గ ట్రస్ట్ కోఆర్డినేటర్ గుబ్బల శ్రీనివాస్, జనసేన పార్టీ కె.గంగవరం మండల అధ్యక్షులు చిర్రా రాజకుమార్, పోలిశెట్టి పెదబాబు తదితరులు పాల్గొని బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పారు. పలువురు స్థానిక జనసేన నాయకులు, గ్రామ పెద్దలు కూడా ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు.

# కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై వైఎస్సార్‌సీపీ కన్నెర్ర

## గొల్లపాలెంలో 'చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు' నిరసన కార్యక్రమం



**గొల్లపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు కూటమి ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆందోళనలు చేపట్టాయి. ఎన్నికల సమయంలో ఇచ్చిన మేనిఫెస్టో హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం ప్రజలను మోసగించిందంటూ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా కాజులూరు మండలం గొల్లపాలెం గ్రామంలో మండల కన్వీనర్ పిల్లి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో "చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు" పేరిట నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రామచంద్రపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ హాజరై మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ప్రజలను నమ్మించి మోసగించిందని ఆయన తీవ్ర స్థాయిలో విమర్శించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ వనుం సుబ్బారావు, ఎంపీపీ మాత భారతి మురళి, సాక్షి వాసు రెడ్డి, కొప్పుల సత్తిబాబు, మండల బూత్ కమిటీ అధ్యక్షులు పోతురాజు బాబురావు, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు మాదిరెడ్డి పృథ్వీ రాగ్, రేవు నాగేశ్వరరావు, పోతు శ్రీనివాసు, పోల్నాటి రాంబాబు, పిల్లి నాగరాజు, నిమ్మితి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ హై టెన్షన్ వైర్లు తెగిపడి గడ్డివాము దగ్ధం

## 4 ఎకరాల పశువుల గ్రాసం అగ్నికి ఆహుతి



**కే.గంగవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మండల కేంద్రమైన కె.గంగవరం గ్రామంలోని కె.గంగవరం – దంగేరు రహదారిలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదవశాత్తూ విద్యుత్ హై టెన్షన్ వైర్లు ఒక్కసారిగా తెగిపడటంతో ఓ రైతుకు చెందిన గడ్డివాముపై పడి మంటలు అంటుకున్నాయి. విద్యుత్ తీగలు పడిన వెంటనే మంటలు భారీగా ఎగసిపడ్డాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. దీంతో హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చి పూర్తిగా ఆర్పేశారు. అయినప్పటికీ అప్పటికే గడ్డివాము కాలి బూడిదైంది. ఈ ప్రమాదంలో సదరు రైతుకు తీవ్ర నష్టం వాటిల్లింది. సుమారు 4 ఎకరాల వ్యవసాయ భూమి నుంచి సేకరించిన విలువైన పశువుల దాణా (గడ్డి) మంటల్లో కాలిపోవడంతో ఆ రైతు కన్నీరుమున్నీరవుతున్నాడు. ఊహించని ఈ ప్రమాదంతో కళ్లెదుటే పశువుల గ్రాసం అగ్నికి ఆహుతి కావడంతో రైతు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

### రామచంద్రపురంలో జూన్ 6న

# భారీ ఉచిత కంటి వైద్య శిబిరం

**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురంలోని స్థానిక అగ్రహారం రాజారత్న నగర్‌లో ఉన్న "రాజారత్న అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్ రీసెర్చ్ సెంటర్ అండ్ జనరల్ హాస్పిటల్"లో జూన్ 6వ తేదీ (శనివారం) భారీ ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నారు. రాజారత్న హెల్త్ కేర్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సహకారంతో ఉదయం 10:00 గంటల నుండి సాయంత్రం 4:00 గంటల వరకు ఈ శిబిరం జరగనుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఎడ్యుకేషన్ రిటైర్డ్ జాయింట్ డైరెక్టర్, ప్రముఖ సీనియర్ ఆప్తాల్మాలజిస్ట్ డాక్టర్ గోపీచంద్ గారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఈ వైద్య శిబిరంలో అత్యాధునిక పరికరాలతో రోగులకు ఉచితంగా కంటి స్క్రీనింగ్ మరియు ప్రాథమిక పరీక్షలు నిర్వహిస్తారు. పరీక్షల అనంతరం అవసరమైన వారికి కంటి చూపుకు సంబంధించిన మందులు, ఐ డ్రాప్స్ ఉచితంగా పంపిణీ చేయడంతో పాటు, దృష్టి లోపాలు ఉన్నవారికి అర్హతను బట్టి ఉచితంగా కంటి అద్దాలను కూడా అందజేయనున్నారు. ఎలాంటి వాణిజ్య ప్రయోజనాలు ఆశించకుండా పూర్తి సేవా దృక్పథంతో డాక్టర్ గోపీచంద్ గారు ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు స్పష్టం చేశారు. ఈ శిబిరానికి వచ్చే రోగుల వ్యక్తిగత వివరాలను లేదా వైద్య సమాచారాన్ని ఎలాంటి వ్యాపార ప్రకటనల కోసం గానీ, థర్డ్ పార్టీలకు గానీ ఇవ్వబోమని రోగుల ప్రైవసీకి పూర్తి రక్షణ ఉంటుందని తెలిపారు. అలాగే కమీషన్ల లేదా ఇతర కమర్షియల్ ప్రయోజనాల కోసం రోగులను ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులకు రిఫర్ చేయడం లాంటివి జరగవని నిర్వాహకులు ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. కంటి చూపు సమస్యలతో బాధపడుతున్న రామచంద్రపురం మరియు చుట్టుపక్కల పరిసర ప్రాంతాల ప్రజలందరూ జూన్ 6న జరిగే ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ గోపీచంద్ గారు, రాజారత్న హెల్త్ కేర్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ప్రతినిధులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి సంబంధించి మరిన్ని వివరాలకు 9391700108 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాల్సిందిగా కోరారు.

# ఖరీఫ్ 2026 కోసం 'APAIMS' యాప్ ద్వారా ఎరువుల పంపిణీ

## రైతులు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారి మణిదీప్ సూచన



**చోడవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం మండలం చోడవరం గ్రామంలో మండల వ్యవసాయ అధికారి టీవీఆర్ మణిదీప్ రైతుల కోసం ఖరీఫ్ 2026 ఎరువుల పంపిణీ కార్యక్రమాన్ని నూతన యాప్ 'APAIMS' (ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చర్ ఇన్‌పుట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్) ద్వారా అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. రైతులకు ఎరువుల పంపిణీని పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు వ్యవసాయ శాఖ ఈ నూతన విధానాన్ని తీసుకువచ్చిందని దీని ద్వారా ఎరువులు పొందడానికి రైతులు తప్పనిసరిగా యాప్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. "సరైన రైతుకు – సరైన సమయంలో సరైన పరిమాణంలో ఎరువులు అందించడమే" ప్రధాన లక్ష్యంగా ఈ ఏపీఏఐఎంఎస్ విధానాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు ఆయన వివరించారు. ఖరీఫ్–2026 పంట సీజన్ కోసం రైతులు తాము సాగు చేసే పంట వివరాలను ఆధార్‌కు అనుసంధానమైన డి.పి.ఎల్. వివరాల ఆధారంగా నమోదు చేయించుకోవాలని సూచించారు. కేవలం భూయజమానులే కాకుండా కౌలు రైతులు కూడా ఈ విధానంలో ఎరువులు పొందేందుకు పూర్తి అర్హులని తెలిపారు. ఒకవేళ వెబ్‌ల్యాండ్‌లో వివరాలు నమోదు కాని భూములకు సంబంధించి మండల వ్యవసాయ అధికారి లాగిన్ ద్వారా వివరాలను నమోదు చేసే ప్రత్యేక అవకాశం కల్పించారు. ముందుగా చేసుకున్న పంట సాగు ప్రణాళిక ఆధారంగానే రైతులకు ఎంత మోతాదులో ఎరువులు అవసరమవుతాయో అంచనా రూపొందిస్తారని వ్యవసాయ శాఖ స్పష్టం చేసింది. ఎరువులు పొందాలనుకునే రైతులు ముందుగా తమ ఆధార్ కార్డు, కౌలు కార్డు, సాగు చేస్తున్న పంట వివరాలు, బ్యాంకు ఖాతా పుస్తకంతో సమీపంలోని రైతు సేవా కేంద్రంలో తమ పేర్లను నమోదు చేసుకోవాలి. ఆ తర్వాత రైతులు ఆర్ఎస్‌కే లేదా సంబంధిత అధికారుల ద్వారా తమ నమోదు స్థితిని (స్టేటస్) సులభంగా తెలుసుకోవచ్చు. ఈ నమోదు ప్రక్రియ విజయవంతంగా పూర్తయిన అనంతరం రైతులు నేరుగా రిటైలర్ వద్దకు వెళ్లి బయోమెట్రిక్ విధానంలో వేలిముద్ర వేసి ధృవీకరణ పూర్తి చేసిన తర్వాతే తమకు కేటాయించిన ఎరువులను పొందవచ్చని అధికారులు వివరించారు. ఈ మొత్తం ప్రక్రియలో రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ సరైన పంట వివరాలను మాత్రమే నమోదు చేయాలని అలాగే తమ ఆధార్, మొబైల్ నంబర్ వివరాలు సరిగ్గా ఉన్నాయో లేదో సరిచూసుకోవాలని సూచించారు. ఎరువుల కొనుగోలు సమయంలో బయోమెట్రిక్ ధృవీకరణ తప్పనిసరని స్పష్టం చేశారు. ఈ నూతన ఎరువుల పంపిణీ విధానంపై లేదా యాప్ నమోదుపై రైతులకు ఏవైనా సందేహాలు ఉంటే వెంటనే సమీపంలోని రైతు సేవా కేంద్రాన్ని లేదా మండల వ్యవసాయ కార్యాలయాన్ని సంప్రదించి నివృత్తి చేసుకోవచ్చని వ్యవసాయ అధికారి సూచించారు.

# వేగాయమ్మపేటలో ఉత్సాహంగా టీడీపీ యూనిట్ ఇన్‌చార్జిల సమావేశం



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం రూరల్ మండలం పరిధిలోని వేగాయమ్మపేట గ్రామంలో తెలుగుదేశం పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు పార్టీ యూనిట్ ఇన్‌చార్జిల విస్తృత స్థాయి సమావేశం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. అట్టడుగు స్థాయి నుంచి సంస్థాగతంగా పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి రామచంద్రపురం నియోజకవర్గ ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ శ్రీ బొమ్ము లక్ష్మణ రావు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ అభివృద్ధికి, బలోపేతానికి అహర్నిశలు శ్రమిస్తున్న ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం ఉంటుందని అందరూ ఐకమత్యంతో పనిచేసి పార్టీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో పార్టీ అధినాయకత్వం సూచించిన మార్గదర్శకాలను, పార్టీ సిద్ధాంతాలను ప్రతి గడపకూ తీసుకెళ్లాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపైనే ఉందన్నారు. స్థానిక సమస్యల పరిష్కారానికి మరియు ప్రజా సంక్షేమానికి తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈ కీలక సమావేశంలో గ్రామ బూత్ ఇన్‌చార్జిలు, గ్రామ కమిటీ సభ్యులతో పాటు పెద్ద ఎత్తున తెలుగుదేశం పార్టీ నాయకులు, క్రియాశీలక కార్యకర్తలు పాల్గొన్నారు. పార్టీ బలోపేతం భవిష్యత్ కార్యాచరణపై పలు కీలక అంశాలను సుదీర్ఘంగా చర్చించిన అనంతరం ఈ సమావేశం విజయవంతంగా ముగిసింది.



# నవ్యాంధ్ర పర్యాటకానికి 'గ్లోబల్' కిరీటం.. "బెస్ట్ టూరిజం ప్రమోషన్ స్టేట్"గా ఆంధ్రప్రదేశ్

## గ్లోబల్ ట్రావెల్ మార్కెట్ 2026 వేదికగా అవార్డు అందుకున్న పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్
## అవార్డు నాకు దక్కిన వ్యక్తిగత గౌరవం కాదు.. ఆంధ్రప్రదేశ్ ప్రజల సంయుక్త కృషికి దక్కిన గుర్తింపు.. మంత్రి దుర్గేష్ భావోద్వేగం
## సీఎం విజన్.. డిప్యూటీ సీఎం ఆలోచనలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లిన మంత్రి కందుల దుర్గేష్

**అమరావతి/తిరువనంతపురం (కేరళం), విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగం అంతర్జాతీయ స్థాయిలో సరికొత్త చరిత్ర సృష్టించింది. రాష్ట్రంలోని అపారమైన పర్యాటక వనరులను, సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పడంలో కూటమి ప్రభుత్వం చూపిన అసాధారణ ప్రతిభకు గానూ దక్షిణాదిలోనే అతిపెద్ద ట్రావెల్ అండ్ ట్రేడ్ ఎక్స్‌పో అయిన 'గ్లోబల్ ట్రావెల్ మార్కెట్-2026'ఆంధ్రప్రదేశ్‌ను "బెస్ట్ టూరిజం ప్రమోషన్ స్టేట్"గా ఎంపిక చేసింది. కేరళలోని కోవాలం 'లీలా తిరువనంతపురం రావిజ్ హోటల్'లో జరిగిన ప్రతిష్టాత్మక బిజినెస్-టు-బిజినెస్, బిజినెస్-టు-కన్స్యూమర్ పర్యాటక వేదికపై, దేశవిదేశాల ప్రముఖుల సమక్షంలో కేరళం పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి పి.సి. విశ్వనాథ్, ఎమ్మెల్యే మురళీధరన్, త్రివేండ్రం మేయర్ వి.వి.రాజేష్ ల చేతుల మీదుగా రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఈ అవార్డును సంతోషంగా స్వీకరించారు. ఉత్తమ పర్యాటక ప్రచార రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఎంపికపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రెండో రోజు కేరళం పర్యటనలో భాగంగా అవార్డు స్వీకరించిన అనంతరం మంత్రి కందుల దుర్గేష్ భావోద్వేగంతో మాట్లాడుతూ... "తిరువనంతపురం వేదికగా ఈ అరుదైన పురస్కారాన్ని అందుకోవడం నాకు దక్కిన గొప్ప గౌరవంగా భావిస్తున్నాను. ఈ గుర్తింపును అందించిన నిర్వాహకులకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు. ఈ అవార్డును నేను ఒక వ్యక్తిగత గౌరవంగా కాకుండా.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల దిశానిర్దేశంలో, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, మా పర్యాటక భాగస్వాములు మరియు ఏపీ ప్రజలు అందరూ కలిసి చేసిన సంయుక్త కృషికి దక్కిన గౌరవంగా భావించి స్వీకరిస్తున్నాను. సీఎం చంద్రబాబునాయుడు పర్యాటక రంగానికి 'పారిశ్రామిక హోదా' కల్పించడంతో పాటు, నూతన పర్యాటక పాలసీ 2024-29 ద్వారా ఇన్వెస్టర్లకు క్యాపిటల్ సబ్సిడీలు, 100% ఎస్జీఎస్టీ రీయింబర్స్‌మెంట్ ఇస్తూ 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'కు పెద్దపీట వేశారు. పీపీపీ విధానంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ 7 యాంకర్ పర్యాటక హబ్‌లతో పాటు 25కు పైగా థీమాటిక్ సర్క్యూట్లను అభివృద్ధి చేస్తున్నాం. 'వికసిత్ భారత్ - 2047' లక్ష్యంగా 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచంలోనే అత్యుత్తమ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడమే మా సంకల్పం..భారతదేశ పర్యాటక వృద్ధి కథనంలో ఆంధ్రప్రదేశ్ ఒక బలమైన శక్తిగా ఎదుగుతోందనే నమ్మకాన్ని ఈ సత్కారం మరింత బలోపేతం చేసింది" అన్నారు.పర్యాటకం అనేది కేవలం ప్రయాణం మాత్రమే కాదని.. అది సమాజంలోని కళాకారుల నుండి వ్యాపారవేత్తల వరకు ప్రతి ఒక్కరికీ ఉపాధిని, జీవనోపాధిని కల్పించే



ఒక ఆర్థిక వృద్ధి ఇంజిన్ అని మంత్రి దుర్గేష్ అభివర్ణించారు.

**GTM వేదికపై పెట్టుబడులకు పిలుపు - 'GTM 2027' ఏపీలోనే!**

అంతకుముందు, 'గ్లోబల్ ట్రావెల్ మార్కెట్ 2026' ఎగ్జిబిషన్‌ను మంత్రి దుర్గేష్ ప్రారంభించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ పర్యాటక స్టాల్‌ను ప్రారంభించి, పర్యాటక విశేషాల బ్రోచర్లను స్వయంగా పంపిణీ చేశారు. ఇంటర్నేషనల్ టూర్ ఆపరేటర్లతో ముఖాముఖి చర్చించి, భారతదేశంలోని వివిధ రాష్ట్రాల పర్యాటకులను ఆంధ్రప్రదేశ్ వైపు ఆకర్షించడం కోసం నిర్వహిస్తున్న 'హాలిడే ఇన్ ఏపీ' క్యాంపెయిన్‌ను గురించి వివరించారు. ఈ సందర్భంగా ఏపీ పర్యాటక వృద్ధిని చూసి ప్రభావితమైన నిర్వాహకులు వచ్చే ఏడాది (సెప్టెంబర్ 27, 2027) వరల్డ్ టూరిజం డే సందర్భంగా 'జిటిఎం 2027' ఎక్స్ పోను ఆంధ్రప్రదేశ్‌లోనే నిర్వహిస్తామని అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా గ్లోబల్ ట్రావెల్ మార్కెట్ ప్రారంభోత్సవంలో ప్రసంగించిన మంత్రి దుర్గేష్..ఏపీలో వెల్ నెస్, క్రూయిజ్ టూరిజం లో ఇన్వెస్ట్ చేయండి.. ఇదే బెస్ట్ టైమ్ అని పిలుపునిచ్చారు. తద్వారా ఇన్వెస్టర్లు బెనిఫిట్ అవుతారని చెప్పారు. బీచ్, టెంపుల్స్, రివర్, బ్యాక్ వాటర్స్, వైల్డ్ లైఫ్, ఎకో, అడ్వెంచర్, క్రూజ్, కల్నరీ, కల్చర్, వెల్ నెస్ , హెరిటేజ్, బుద్ధిస్ట్ టూరిజం.. ఇలా ఒక్కటేమిటి భారతదేశంలోని ప్రతి అద్భుత దృశ్యం ఏపీలోనే ఉందని, 'సరికొత్త ఆలోచనలతో రండి.. పెట్టుబడులు పెట్టండి.. మీకు అండగా మేముంటాం' అని జీటీఎం వేదికగా టూర్ ఆపరేటర్లు, ఇన్వెస్టర్లను మంత్రి దుర్గేష్ ఆహ్వానించారు.

**ఏపీ ఒక సంపూర్ణ పర్యాటక ప్యాకేజీ:మంత్రి కందుల దుర్గేష్**

ప్రపంచంలోనే అత్యంత సంపన్నమైన, అత్యధికులు దర్శించే ఆధ్యాత్మిక క్షేత్రం 'తిరుమల'తో పాటు 80 వేలకు పైగా దేవాలయాలకు నిలయం ఏపీ అని, 13 వన్యప్రాణి సంరక్షణ కేంద్రాలు (వైల్డ్ లైఫ్ శాంచ్యురీలు), 3 జాతీయ పార్కులు, దేశంలోనే అతిపెద్ద టైగర్ రిజర్వ్ (నాగార్జునసాగర్-శ్రీశైలం) మరియు భారతదేశంలోనే రెండవ అతిపెద్ద మడ అడవుల (మ్యాంగ్రోవ్స్) తీరప్రాంతం తమ సొంతమన్నారు. చారిత్రక లేపాక్షి వీరభద్రస్వామి ఆలయం, తిరుమల కొండలు మరియు విశాఖలోని అరుదైన ఎర్రమట్టి దిబ్బలకు యునెస్కో తాత్కాలిక ప్రపంచ వారసత్వ కట్టడాల జాబితాలో స్థానం సంపాదించాయన్నారు.స్వదేశీ పర్యాటకుల సందర్శనలో దేశంలోనే 4వ స్థానంలో ఉన్నామని, 1,054 కిలోమీటర్లతో భారతదేశంలోనే 3వ అతిపెద్ద తీరప్రాంతం, పర్యాటకానికి అనువైన 283 అద్భుతమైన బీచ్‌లు ఏపీ సొంతమని మంత్రి కందుల దుర్గేష్ వివరించారు.కడప జిల్లాలోని గండికోట 'ఇండియాస్ గ్రాండ్ కాన్యన్'గా ప్రపంచ ప్రసిద్ధి చెందిందని, అద్భుతమైన పడవ ప్రయాణాలకు, ప్రకృతి అందాలకు నిలయమైన బ్యాక్‌వాటర్ వనరులలో దేశంలోనే 2వ స్థానంలో ఏపీ ఉందని గణాంకాలతో సహా వివరించారు. 300కు పైగా ఎగ్జిబిటర్లు, 1,000 మందికి పైగా బయ్యర్లు ఒకే చోట చేరిన జీటీఎం 2026 సదస్సు కేవలం ఒక ప్రదర్శన మాత్రమే కాదని, ఇది సరికొత్త ఆవిష్కరణలకు, ఆర్థిక వృద్ధికి మరియు పరస్పర అనుసంధానానికి ఒక ప్రధాన చోదక శక్తి గా మంత్రి దుర్గేష్ అభివర్ణించారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నేడు పర్యాటక రంగంలో కళ్లు చెదిరే మార్పులకు సాక్ష్యంగా నిలుస్తోందని మంత్రి పేర్కొన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ రికార్డు స్థాయిలో 36.42 కోట్ల పర్యాటక సందర్శనలను నమోదు చేసి సుస్థిర వృద్ధిని సాధించిందని, దేశీయ పర్యాటకంలో ఏపీ ఇప్పటికే దేశంలోనే అగ్రగామిగా కొనసాగుతుండగా.. అంతర్జాతీయ పర్యాటకుల రాకలో ఏకంగా 48% పైగా స్పష్టమైన వృద్ధి నమోదైందని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ అనేది కేవలం సందర్శించే స్థలం కాదు.. అదొక అద్భుతమైన అనుభూతి. ఇక్కడ ప్రతి ప్రయాణం ఒక కథను చెబుతుంది, ఇక్కడికి వచ్చే ప్రతి పర్యాటకుడు ఆ కథలో ఒక భాగమవుతాడు అనే స్ఫూర్తిదాయకమైన మాటలతో మంత్రి దుర్గేష్ తన ప్రసంగాన్ని ముగించారు.

**ఏపీ టూరిజాన్ని నెక్స్ట్ లెవెల్‌కి తీసుకెళ్లిన ఘనత మంత్రి కందుల దుర్గేష్‌ది : ప్రతినిధులు**

ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అతి తక్కువ కాలంలోనే మంత్రి కందుల దుర్గేష్'బ్రాండ్ ఏపీ' పేరుతో సోషల్ మీడియా, అంతర్జాతీయ ప్లాట్‌ఫామ్స్‌పై డిజిటల్ బ్రాండింగ్ సరికొత్తగా డిజైన్ చేశారని ప్రతినిధులు కొనియాడారు. విశాఖ, విజయవాడ, తిరుపతి, ఢిల్లీలలో రీజినల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్స్.. చెన్నై, కోల్‌కతా,ఢిల్లీ, ముంబై, బెంగళూరు, హైదరాబాద్ లలో రోడ్ షోలు నిర్వహించడంతో పాటు బెర్లిన్, లండన్ వంటి అంతర్జాతీయ వేదికలపై ఏపీ పర్యాటక వాణిని బలంగా వినిపించారని అవి తమను ఆకర్షించాయన్నారు. కేవలం టెంపుల్ టూరిజానికే పరిమితం కాకుండా ఎకో, అడ్వెంచర్, హెరిటేజ్, బీచ్, క్రూయిజ్, రివర్, కల్చర్, మెడికల్ టూరిజంలను ప్రోత్సహించారని పేర్కొన్నారు. సీప్లేన్ సర్క్యూట్లు, వాటర్ స్పోర్ట్స్, కారవాన్ టూరిజం, లగ్జరీ టెంట్ సిటీలు, హోమ్ స్టేలను అందుబాటులోకి తెచ్చి ఏపీ టూరిజాన్ని నెక్స్ట్ లెవెల్‌కి తీసుకెళ్లిన ఘనత మంత్రి దుర్గేష్ కు దక్కుతుందన్నారు. పర్యాటక ప్రమోషన్‌లో భాగంగా స్థానిక కళలు, వంటకాలు, హస్తకళలకు ప్రాధాన్యత ఇస్తూ గ్రామీణ పర్యాటకాన్ని బలోపేతం చేయడం ద్వారా స్థానిక జనసమూహాల ఆర్థికాభివృద్ధికి కృషి చేయడం, ఏడాదంత పర్యాటక శోభ ఉండేలా పర్యాటక ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం ఆయన పనితీరుకు నిదర్శనమని కొనియాడారు. ముఖ్యంగా సీఎం విజన్‌ను, డిప్యూటీ సీఎం ఆలోచనలను క్షేత్రస్థాయిలో అమలు చేయడంలో మంత్రి కందుల దుర్గేష్ విజయవంతం అయ్యారని వారు తెలిపారు. ఈ క్రమంలో కేవలం 24 నెలల కాలంలోనే ఒబెరాయ్, తాజ్, ఎట్మోస్ఫియర్ కోర్, రాడిసన్ బ్లూ, నోవాటెల్, మేఫేర్, ఫెమా, జీఆర్టీ, ఐటీసీ, సరోవర్, దస్పల్లా, ఫార్చ్యూన్, మారియట్, వివంత, హిల్టన్, లెమన్ ట్రీ. హయత్, కల్ట్ మహీంద్ర తదితర ప్రఖ్యాత 117 సంస్థలతో ఎంవోయూలు కుదుర్చుకుని, రాష్ట్రానికి దాదాపు రూ.20,000 కోట్ల పెట్టుబడులను ఆకర్షించడం, దాదాపు 8 పర్యాటక ప్రాజెక్టులకు గానూ రూ.430 కోట్ల కేంద్ర నిధులను సాధించడమేగాక పర్యాటక రంగాన్ని ఆర్థిక వృద్ధికి, ఉపాధి కల్పనకు ప్రధాన ఇంజిన్‌గా మార్చడం, పలు పర్యాటక ప్రాంతాలకు ప్రాచుర్యం కల్పించడం వంటి అంశాలు పురస్కారం వచ్చేందుకు కారణమయ్యాయని నిర్వాహకులు తెలిపారు. అతి తక్కువ కాలంలోనే లభించిన ఈ అంతర్జాతీయ గుర్తింపు రాష్ట్ర పర్యాటక రంగానికి ఒక 'స్వర్ణయుగం'గా నిలుస్తుంది.

# కోకో బీన్స్‌కు నాణ్యతా ప్రమాణాల రూపకల్పనపై రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌లో కోకో సాగు నాణ్యతను మెరుగుపరచి అంతర్జాతీయ మార్కెట్లలో పోటీతత్వాన్ని పెంపొందించేందుకు భారతీయ కోకో బీన్స్‌కు ప్రమాణాల రూపకల్పన అవసరమని ఏపీ రాష్ట్ర ప్రభుత్వ పరిశ్రమలు, వాణిజ్య శాఖ ప్రధాన కార్యదర్శి చిరంజీవి చౌదరి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ (ఏపీఎఫ్‌పీఎస్) ఆధ్వర్యంలో గురువారం రాజమహేంద్రవరంలోని ఐసీఏఆర్-ఎన్ఐఆర్‌సీఏలో నిర్వహించిన "ఎస్టాబ్లిషింగ్ స్టాండర్డ్స్ ఆఫ్ ఇండియన్ కోకో బీన్స్" అంశంపై ఒకరోజు అవగాహన వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆహార ప్రాసెసింగ్, పరిశ్రమలు మరియు వాణిజ్య శాఖ ప్రధాన కార్యదర్శి చిరంజీవి చౌదరి మాట్లాడుతూ, కోకో పంటకు ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ప్రధాన ఉత్పత్తి కేంద్రంగా ఎదుగుతోందన్నారు. రైతులు నాణ్యత ప్రమాణాలను పాటించడం ద్వారా అధిక ధరలు పొందే అవకాశాలు పెరుగుతాయని, ప్రాసెసింగ్ రంగంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు నాణ్యమైన ముడి పదార్థం అత్యంత కీలకమని పేర్కొన్నారు. కోకో విలువ శృంఖల అభివృద్ధికి ప్రభుత్వం అవసరమైన సహకారం అందిస్తుందని తెలిపారు. రైతులు శాస్త్రీయ పద్ధతులను అనుసరించడం ద్వారా కోకో ఉత్పత్తుల నాణ్యతను మరింత మెరుగుపరచవచ్చన్నారు. పంట అనంతర నిర్వహణ, ఫర్మెంటేషన్, ఎండబెట్టే విధానాల్లో అవగాహన పెంపు ద్వారా అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణమైన ఉత్పత్తి సాధ్యమవుతుందని చెప్పారు. రైతులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, పారిశ్రామికవేత్తలు పరస్పర సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. చిరంజీవి చౌదరి మాట్లాడుతూ, నాణ్యమైన కోకో ఉత్పత్తి కోసం పరిశోధన, విస్తరణ సేవలు, సాంకేతిక పరిజ్ఞాన బదిలీ



కీలకమని వివరించారు. రైతులకు శాస్త్రీయ సాగు పద్ధతులపై నిరంతర శిక్షణ అవసరమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కోకో నాణ్యతాభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. అధిక దిగుబడులతో పాటు నాణ్యమైన ఉత్పత్తి సాధనపై ఉద్యానవన శాఖ దృష్టి సారించిందని తెలిపారు. ఏపీఎఫ్‌పీఎస్ సీఈఓ గెద్దం శేఖర్ బాబు మాట్లాడుతూ, కోకో రైతులను ప్రాసెసింగ్ పరిశ్రమలతో అనుసంధానం చేయడం, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీకి ప్రోత్సాహం అందించడం సంస్థ ప్రధాన లక్ష్యమన్నారు. నాణ్యతా ప్రమాణాల ఏర్పాటు ద్వారా రాష్ట్ర కోకోకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. కోకోశాల (చెన్నై) వ్యవస్థాపకుడు, కన్సల్టెంట్ నితిన్ చోర్డియా సాంకేతిక సెషన్‌లో మాట్లాడుతూ, అంతర్జాతీయ మార్కెట్‌లో కోకో బీన్స్‌కు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో నాణ్యత ప్రమాణాలు అత్యంత ప్రాధాన్యమని చెప్పారు. కోకో గింజల ఫర్మెంటేషన్, ఎండబెట్టడం, గ్రేడింగ్, నిల్వ విధానాల్లో పాటించాల్సిన శాస్త్రీయ పద్ధతులను వివరించారు. చాక్లెట్, కోకో పౌడర్, కోకో బటర్ తదితర విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ అవకాశాలపై రైతులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవగాహన కల్పించారు. వక్తలు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం సుమారు 38,671 హెక్టార్లలో కోకో సాగు జరుగుతోందని, ఏలూరు, పశ్చిమ గోదావరి, కోనసీమ జిల్లాలు కోకో ఉత్పత్తిలో కీలక పాత్ర పోషిస్తున్నాయని వర్క్‌షాప్‌లో వెల్లడించారు. నాణ్యత పెంపు ద్వారా రైతుల ఆదాయాన్ని మరింతగా పెంచే అవకాశాలు ఉన్నాయని నిపుణులు అభిప్రాయపడ్డారు.

**కోకో సాగు, ప్రాసెసింగ్‌పై మార్గదర్శకాలకు 79950 87041 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌ను సంప్రదించాలి**

కోకో సాగు, కోకో బీన్స్ నాణ్యతా ప్రమాణాలు, ఫర్మెంటేషన్ మరియు ఎండబెట్టే శాస్త్రీయ పద్ధతులు, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ, ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపన తదితర అంశాలపై మరింత సమాచారం పొందాలనుకునే కోకో రైతులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఎఫ్‌పీఓలు), ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు తూర్పుగోదావరి జిల్లా ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ (ఏపీఎఫ్‌పీఎస్) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ. దుర్గేష్‌ను మొబైల్ నంబర్ o91 79950 87041 ద్వారా సంప్రదించి అవసరమైన సాంకేతిక మార్గదర్శకాలు, శిక్షణ కార్యక్రమాల వివరాలు, ప్రాసెసింగ్ మరియు మార్కెటింగ్ అవకాశాలపై అవగాహన పొందవచ్చని అధికారులు తెలిపారు. ఈ కార్యశాలలో ఉద్యానవన శాఖ డైరెక్టర్, ఏపీఎఫ్‌పీఎస్ సీఈఓ గెద్దం శేఖర్ బాబు, కోకోశాల వ్యవస్థాపకుడు నితిన్ చోర్డియా, తూర్పు గోదావరి జిల్లా ఏపీఎఫ్‌పీఎస్ ఈడీ ఏ దుర్గేష్, ఉద్యానవన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ యు. సుధ, ఐదు జిల్లాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, రైతు ఉత్పత్తిదారుల సంఘాల ప్రతినిధులు, కోకో ప్రాసెసింగ్ యూనిట్ల ప్రతినిధులు, కోకో రైతులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

### గోదావరి పుష్కరాల్లో

# నేత్ర వైద్య శిబిరాలు నిర్వహించాలి

## వైద్యారోగ్య శాఖా మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ ఆదేశం



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** వచ్చే ఏడాది జూన్ లో జరగనున్న పవిత్ర గోదావరి పుష్కరాల్ని పురస్కరించుకుని వైద్య సేవల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు. ముఖ్యంగా నేత్ర వైద్య శిబిరాల్ని నిర్వహించాలని స్పష్టంచేశారు. 'ఆంధ్రప్రదేశ్ రైట్ టు సైట్ సొసైటీ' గవర్నింగ్ బాడీ సమావేశం వెలగపూడిలోని ఏపీ సచివాలయంలో 11 ఏళ్ల అనంతరం తొలిసారిగా మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ అధ్యక్షతన గురువారం జరిగింది. దీనికి సీఎం చైర్మన్ గా ఉన్నారు. వైస్-ఛైర్మన్ గా ఉన్న మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ పారా మెడికల్, ఆప్తాల్మిక్ ఖాళీల భర్తీకి ప్రాంతీయ సంచాలక కార్యాలయాలు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఖాళీల భర్తీకి జీరో వేకెన్సీ విధానాన్ని వర్తింప చేయాలని అధికారులకు స్పష్టంచేశారు. అలాగే.. పారా మెడికల్ ఆప్తాల్మిక్ అసిస్టెంట్ కోర్సు నిర్వహణ, రిజిస్ట్రేషన్ల నిర్వహణ గురించి విపులంగా ఈ సమావేశంలో చర్చించారు. జాతీయ అంధత్వ నియంత్రణ, దృష్టిలోపాల నివారణ కార్యక్రమాల అమలు పురోగతిని కూడా మంత్రి సమీక్షించారు. వైద్య సేవలు ఇంకా మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టంచేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర వైద, ఆరోగ్య శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్, ప్రజారోగ్య శాఖ సంచాలకులు డాక్టర్ పద్మావతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## ఆ హీరో నా ఫస్ట్ క్రష్.. ఎప్పటికైనా అతడితో డేట్‌కు వెళ్తాను..

# హీరోయిన్ మీనాక్షి చౌదరి



తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేని హీరోయిన్ మీనాక్షి చౌదరి. తక్కువ సమయంలోనే విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకుంది. ఇటీల కొంత కాలంగా వరుస హిట్స్ అందుకుంటూ గోల్డెన్ బ్యూటీగా దూసుకుపోతున్న ఈ అమ్మడు.. ప్రస్తుతం తెలుగు, తమిళంలో రాణిస్తుంది. ఇదిలా ఉంటే.. ఇటీవల తన ఫస్ట్ క్రష్ గురించి చెప్పుకొచ్చింది ఈ అమ్మడు. టాలీవుడ్‌లో ప్రస్తుతం మోస్ట్ వాంటెడ్ హీరోయిన్లలో ఒకరిగా దూసుకుపోతోంది పంజాబీ ముద్దుగుమ్మ మీనాక్షి చౌదరి. 'హిట్ 2', 'గుంటూరు కారం', 'లక్కీ భాస్కర్' వంటి చిత్రాలతో వరుస విజయాలను అందుకుంటూ ఇండస్ట్రీలో 'లక్కీ ఛామ్'గా మారిపోయింది. కేవలం టాలీవుడ్‌లోనే కాకుండా కోలీవుడ్‌లోనూ (తమిళ పరిశ్రమ) విజయ్ దళపతి సరసన నటించి అక్కడి ప్రేక్షకుల మనసులను గెలుచుకుంది. ఈ క్రమంలోనే కోలీవుడ్ స్టార్ హీరో శింబు గురించి మీనాక్షి చౌదరి చేసిన కొన్ని క్రేజీ వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో మీనాక్షి చౌదరికి ఒక ఆసక్తికరమైన ప్రశ్న ఎదురైంది. "ఒకవేళ మీరు సినీ పరిశ్రమకు చెందిన ఏ హీరోతోనైనా 'మూవీ డేట్' (సినిమాకు వెళ్లడం) కి వెళ్లాల్సి వస్తే.. ఎవరిని ఎంచుకుంటారు?" అని యాంకర్ అడిగారు. దీనికి మీనాక్షి ఏమాత్రం తడుముకోకుండా, ఎంతో ఉత్సాహంగా కోలీవుడ్ స్టార్ హీరో శింబు పేరును చెప్పింది. "నేను మూవీ డేట్‌కు వెళ్లాలనుకుంటే ఖచ్చితంగా శింబు సార్‌తోనే వెళ్తాను" అంటూ చాలా ఎగ్జైటింగ్‌గా సమాధానం ఇచ్చింది. శింబు స్క్రీన్ ప్రెజెన్స్, ఆయన నటన అంటే తనకు చాలా ఇష్టమని ఈ బ్యూటీ పేర్కొంది. శింబుపై మీనాక్షి చేసిన ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా శింబు అభిమానులు ఈ వ్యాఖ్యలపై హర్షం వ్యక్తం చేస్తూ, ఈ ఇద్దరి కాంబినేషన్‌లో ఒక సినిమా వస్తే చూడాలని ఉందంటూ కామెంట్లు పెడుతున్నారు. కాగా, ప్రస్తుతం కోలీవుడ్ సర్కిల్స్‌లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం... దర్శకుడు అశ్వత్ మరిముత్తు నేతృత్వంలో శింబు నటిస్తున్న భారీ ప్రాజెక్ట్ 'ఎస్‌టీఆర్ 49'లో మీనాక్షి చౌదరి కథానాయికగా నటించే గోల్డెన్ ఛాన్స్ కొట్టేసినట్లు టాక్ నడుస్తోంది. ఈ సినిమా గురించిన చర్చల నేపథ్యంలోనే ఆమె శింబుపై ఇలాంటి క్రేజీ కామెంట్స్ చేయడం విశేషం. వరుస సక్సెస్‌లతో జోరు మీదున్న మీనాక్షి, ఒక పక్క తెలుగులో నాగచైతన్యతో 'వృషకర్మ' వంటి చిత్రాల్లో నటిస్తూనే, మరోపక్క తమిళంలోనూ క్రేజీ ఆఫర్లను సొంతం చేసుకుంటూ బిజీగా గడుపుతోంది. కెరీర్ పరంగా ఇంత సక్సెస్‌ఫుల్‌గా సాగుతున్న ఈ డాక్టరమ్మ (దీణా గ్రాడ్యుయేట్), భవిష్యత్తులో శింబుతో కలిసి స్క్రీన్ షేర్ చేసుకుంటే బాక్సాఫీస్ వద్ద మరిన్ని సంచలనాలు సృష్టించడం ఖాయమని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. శ్రీలీల, భాగ్యశ్రీ బోర్సే లాంటి తోటి హీరోయిన్లు ఫ్లాపుల్లో ఉన్న తరుణంలో మీనాక్షి చౌదరి ఇలా వరుస అప్‌డేట్స్‌తో ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా నిలుస్తోంది. హర్యానాకు చెందిన మీనాక్షి చౌదరి చదువులో చాలా యాక్టివ్. ఆమె ఒక డెంటిస్ట్. చదువు పూర్తి చేసిన తర్వాత మోడలింగ్ రంగంలోకి అడుగుపెట్టిన ఆమె, 2018లో జరిగిన ప్రతిష్టాత్మక 'ఫెమినా మిస్ ఇండియా' పోటీల్లో రన్నరప్‌గా నిలిచారు. ఆ తర్వాత 'మిస్ గ్రాండ్ ఇంటర్నేషనల్ 2018' పోటీల్లో భారతదేశం తరపున ప్రాతినిధ్యం వహించి ఫస్ట్ రన్నరప్ కిరీటాన్ని గెలుచుకున్నారు. 2021లో సుశాంత్ హీరోగా వచ్చిన 'ఇచ్చట వాహనములు నిలుపరాదు' సినిమాతో టాలీవుడ్‌కు పరిచయమయ్యారు.

## రెండు వారాల్లోనే ఓటీటీలోకి..

# సైకలాజికల్ రొమాంటిక్ థ్రిల్లర్ మూవీ..




ఓటీటీలో రకరకాల సినిమాలు విడుదలై అలరిస్తున్నాయి. ఇప్పటికే ఎన్నో అద్భుతమైన సినిమాలు ఓటీటీలో దూసుకుపోతున్నాయి. అలాగే రకరకాల జోనర్స్ లో సినిమాలు అందుబాటులో ఉన్నాయి. ఇక కొత్త సినిమాలు కూడా ఓటీటీలో విడుదలై అలరిస్తున్నాయి. థియేటర్స్‌లో విడుదలైన నెలరోజులకు సినిమాలు ఓటీటీలోకి వచ్చేస్తున్నాయి. థియేటర్స్‌లో పెద్ది సినిమా ప్రస్తుతం సందడి చేస్తుంది. జూన్ 4న (నేడు) పెద్ది సినిమా థియేటర్స్ లోకి వచ్చింది. ఈ సినిమా కోసం ఎప్పటినుంచో ఎదురుచూస్తున్నారు. వాయిదాల మీద వాయిదాలు పడుతూ ఎట్టకేలకు థియేటర్స్ లోకి వచ్చేసింది. ఈ సినిమా బ్లాక్ బస్టర్ టాక్ సొంతం చేసుకుంది. థియేటర్స్‌లో ఫ్యాన్ పండగ చేసుకుంటున్నారు. పెద్ది సినిమాతో రామ్ చరణ్ బ్లాక్ బస్టర్ సొంతం చేసుకోవడంతో అభిమానులు సంబరాలు చేసుకుంటున్నారు. ఇదిలా ఉంటే ఓటీటీలోనూ సినిమాలు సందడి చేస్తున్నాయి. కొత్త సినిమాలు థియేటర్స్‌లో అలరిస్తుంటే ఓటీటీలోకి కొన్ని క్రేజీ సినిమాలు రానున్నాయి. ఇక ఇప్పుడు ఓ రొమాంటిక్ థ్రిల్లర్ సినిమా ఓటీటీలోకి రావడానికి రెడీ అవుతుంది. విడుదలైన రెండు వారాల్లోనే ఓటీటీలోకి ఎంట్రీ ఇస్తుంది. ఇటీవలే ఈ సినిమా థియేటర్స్ లోకి వచ్చింది. ఇక ఇప్పుడు విడుదలైన రెండు వారాల్లోనే ఓటీటీలోకి అడుగుపెడుతుంది. ఆ సినిమా ఏదో కాదు.. అవికా గోర్, శ్రీ నందు లీడ్ రోల్స్‌లో నటించిన 'అగ్లీ స్టోరీ'. ఈ సినిమా రీసెంట్ గా థియేటర్స్ లోకి వచ్చింది. రొమాంటిక్ థ్రిల్లర్ గా తెరకెక్కింది అగ్లీ స్టోరీ సినిమా. ప్రణవ్ స్వరూప్ డైరెక్షన్‌లో వచ్చిన 'అగ్లీ స్టోరీ' సినిమా మే 22న థియేటర్లలో గ్రాండ్‌గా రిలీజైంది. విడుదలకు ముందు మంచి అంచనాలు క్రియేట్ చేసిన ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. కమర్షియల్‌గా బాక్సాఫీస్ దగ్గర ఈ సినిమా ఆడియన్స్‌ను పెద్దగా అట్రాక్ట్ చేయలేకపోవడంతో ఇప్పుడు ఈ సినిమా ఎప్పుడు ఓటీటీలోకి వస్తుందా అని ఎదురుచూస్తున్నారు. ఇక ఇప్పుడు ఓటీటీ రిలీజ్ కు రెడీ అవుతుంది. జూన్ 5న అంటే మరికొన్ని గంటల్లోనే ఓటీటీలోకి రానుంది అగ్లీ స్టోరీ. ప్రముఖ ఓటీటీ సంస్థ ఆహాలో అగ్లీ స్టోరీ సినిమా విడుదలకానుంది. థియేటర్స్ లో ఆకట్టుకోలేకపోయిన అగ్లీ స్టోరీ ఓటీటీలో ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో చూడాలి.

## ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకుందాం..

# క్రికెట్ అంటే మగాళ్లేనా?

### మన మైండ్‌సెట్‌ను కడిగిపారేస్తున్న వరల్డ్ కప్ ప్రోమోలు




క్రికెట్ అంటే కేవలం మెన్స్ క్రికెట్ మాత్రమే కాదని, మహిళా క్రికెటర్లు కూడా భారత క్రికెట్‌కు సమాన ప్రతినిధులేనని ఐసీసీ తన కొత్త ఉమెన్స్ టీ20 వరల్డ్ కప్ ప్రచార వీడియోల ద్వారా బలంగా చెబుతోంది. ప్రేక్షకుల మైండ్‌సెట్‌ను మార్చే లక్ష్యంతో రూపొందించిన ఈ ప్రోమోలు సోషల్ మీడియాలో విశేష ఆదరణ పొందుతున్నాయి. క్రికెట్ అనగానే చాలా మందికి సచినో, కోహ్లీనో, ధోనినో గుర్తుకు వస్తారు. కానీ చాలా తక్కువ మందికి మాత్రమే మిథాలీ రాజ్, హర్మన్‌ప్రీత్ కౌర్ గుర్తుకు వస్తారు. యూత్‌లో కాస్తో కూస్తో క్రేజ్ ఉన్న ఉమెన్ క్రికెటర్ అంటే స్మృతి మంధాననే. అయినా ఆ క్రేజ్ కూడా ఆటతోపాటు అందంగా ఉందనే కారణంతో వచ్చింది. ఇది వినేందుకు కాస్త ఎబ్బెట్టుగా ఉన్నా అదే పచ్చి నిజం. క్రికెట్ ప్రపంచంలో అమ్మాయిలు అద్భుతాలు చేస్తున్నా.. ఇప్పటికీ క్రికెట్ అంటే మెన్స్ క్రికెట్ అనే భ్రమలో మనలో చాలా మంది ఉన్నారు. ఈ మైండ్ సెట్‌ను మార్చేందుకు ఏకంగా ఐసీసీనే బరిలోకి దిగింది. ఈ నెల 12 నుంచి ఉమెన్స్ టీ20 వరల్డ్ కప్ ప్రారంభం కానుంది. నిజం చెప్పాలంటే ఈ విషయం చాలా తక్కువ మందికి తెలుసు. ఈ వార్త చదివే వారికి కూడా ఇప్పుడే ఈ విషయం తెలిసి ఉండొచ్చు. ఇంకా ఐపీఎల్ మూడ్ నుంచి బయటికి రాని వారికి కూడా 6వ తేదీ నుంచి పసికూన ఆఫ్ఘనిస్థాన్‌తో మెన్స్ టీమ్ టెస్ట్ ఆడుతుందనే విషయం తెలుసుకాని, ఎంతో ప్రతిష్టాత్మకమైన ఉమెన్స్ టీ20 వరల్డ్ కప్ ఉందనే విషయం తెలియదు. ఈ ఒక్క విషయం చాలు.. ఉమెన్స్ క్రికెట్ ఎంత నిరాదరణకు గురవుతుందో చెప్పడానికి. అందుకే ఐసీసీ కొత్త ఆలోచనతో ముందుకు వచ్చింది. సాధారణంగా వరల్డ్ కప్ టోర్నీల కంటే ముందు ప్రోమో వీడియాలతో టోర్నీకి ప్రచారం కల్పిస్తారు. ఇప్పుడు ఉమెన్స్ టీ20 వరల్డ్ కప్ 2026 ప్రారంభానికి ముందు కూడా ప్రోమోలు వదులుతున్నారు. అయితే వీటిలో క్రికెట్‌ను ప్రమోట్ చేయడం కంటే.. మన మైండ్‌సెట్‌ను మార్చడంపై దృష్టి పెట్టారు. ఆ ప్రోమోలు చూస్తే.. పురుషాధిక్య సమాజాన్ని చెంప చెల్లుమనిపించేలా ఉన్నాయి. మచ్చుకు ఓ రెండు ప్రోమోల గురించి మాట్లాడుకుంటూ.. బయలుదేరడానికి సిద్ధంగా ఉన్న విమానంలో ఒక్కసారిగా హడావిడి మొదలు అవుతుంది. ఏం జరుగుతుందని అందులోని ఓ ప్రయాణికుడు ఎయిర్ హోస్టెస్‌ను అడుగుతాడు. దాంతో ఆమె ఇండియన్ క్రికెట్ టీమ్ వస్తుందని సమాధానం చెబుతుంది. దాంతో ఆ వ్యక్తి ఛాంపియన్ టీమ్ వస్తుందని తన కొడుకుతో సంతోషంగా చెబుతాడు. అంతలోనే విమానంలోకి ఉమెన్స్ క్రికెటర్లు ఎంటర్ అవుతారు. వాళ్లని చూసి ఆ వ్యక్తి కాస్త నిరాశ చెందుతాడు. ఎందుకంటే ఇండియన్ క్రికెట్ టీమ్ అనగానే.. అతను మెన్స్ టీమ్ అని అనుకుంటాడు.. కానీ వచ్చింది ఉమెన్స్ క్రికెట్ టీమ్ అని తెలిసి నిరాశ చెందుతాడు. కానీ, అతని కొడుకు మాత్రం.. జెమిమా కూడా ఉందా అంటూ ఎంతో ఉత్సాహంగా చూస్తుంటాడు. దాంతో ఆ వ్యక్తి తన తప్పును తెలుసుకుంటాడు.. ఇండియన్ టీమ్ అంటే మెన్స్ టీమ్ మాత్రమే కాదనే విషయం ఆ చిన్నారి స్పందనతో అతనికి బోధపడుతుంది.

## హిస్టరీ రిపీట్స్..

# కప్పు గెలిచిన కెప్టెన్లపైనే బీసీసీఐ వేటు ఎందుకు..



వరుసగా రెండోసారి భారత్‌కు వరల్డ్ కప్ అందించి, కేవలం మూడు నెలలు కూడా గడవక ముందే సూర్యను కెప్టెన్సీ నుంచి తప్పిస్తుండటం అందరినీ షాక్‌కు గురిచేస్తోంది. అయితే ఐసీసీ ట్రోఫీ గెలిచిన కెప్టెన్‌ను తొలగించడం భారత క్రికెట్‌లో ఇదే మొదటిసారి కాదు. ఐపీఎల్ 2026 సీజన్ ముగిసిన తర్వాత భారత క్రికెట్ అభిమానులు అంతర్జాతీయ మ్యాచుల కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అయితే ఊహించని విధంగా టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌ను ఆ పదవి నుంచి తొలగించబోతున్నారనే వార్త ఒక్కసారిగా సంచలనం సృష్టించింది. రోహిత్ శర్మ అంతర్జాతీయ టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత సూర్యకుమార్ యాదవ్‌కు కెప్టెన్సీ పగ్గాలు దక్కాయి. అతని నాయకత్వంలో భారత్ వరుసగా ఎనిమిది ద్వైపాక్షిక సిరీస్‌లు గెలవడమే కాకుండా, 2025 ఆసియా కప్, ఇటీవల మార్చి 2026లో జరిగిన టీ20 వరల్డ్ కప్‌ను కూడా గెలుచుకుంది. వరుసగా రెండోసారి భారత్‌కు వరల్డ్ కప్ అందించి, కేవలం మూడు నెలలు కూడా గడవక ముందే సూర్యను కెప్టెన్సీ నుంచి తప్పిస్తుండటం అందరినీ షాక్‌కు గురిచేస్తోంది. అయితే ఐసీసీ ట్రోఫీ గెలిచిన కెప్టెన్‌ను తొలగించడం భారత క్రికెట్‌లో ఇదే మొదటిసారి కాదు.

### ఐసీసీ ట్రోఫీ గెలిచినా రోహిత్ శర్మకు తప్పని ఉద్వాసన

ఐసీసీ ట్రోఫీ గెలిచిన తర్వాత కూడా కెప్టెన్సీ పదవి నుంచి తొలగించబడిన చివరి భారత కెప్టెన్ మరెవరో కాదు.. లెజెండరీ బ్యాటర్ రోహిత్ శర్మ. విరాట్ కోహ్లీ తప్పుకున్న తర్వాత 2021 డిసెంబర్‌లో రోహిత్ శర్మ వన్డే జట్టుకు పూర్తి స్థాయి కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టాడు. అప్పటి బీసీసీఐ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ నేతృత్వంలోని మేనేజ్‌మెంట్ వైట్-బాల్ క్రికెట్ (వన్డే, టీ20) రెండింటికీ ఒకే కెప్టెన్ ఉండాలని భావించి రోహిత్‌కు బాధ్యతలు అప్పగించింది. రోహిత్ శర్మ కెప్టెన్సీలో వన్డేల్లో భారత్ అద్భుతమైన విజయాలను సాధించింది. 2018, 2023 ఆసియా కప్‌లను గెలవడంతో పాటు, 2023 వన్డే వరల్డ్ కప్‌లో ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా ఫైనల్ చేరింది. ఆ తర్వాత దుబాయ్‌లో జరిగిన ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో న్యూజిలాండ్‌ను ఓడించి భారత్‌ను విజేతగా నిలిపాడు. వన్డే కెప్టెన్‌గా రోహిత్ ఏకంగా 75 శాతం విన్ పర్సంటేజ్ (56 మ్యాచ్‌ల్లో 42 విజయాలు) కలిగి ఉన్నాడు.

### భవిష్యత్తును దృష్టిలో ఉంచుకునే రోహిత్‌పై వేటు

రోహిత్ శర్మ కెప్టెన్సీలో భారత్ మూడోసారి ఛాంపియన్స్ ట్రోఫీ గెలిచి, అత్యధిక సార్లు ఈ కప్పు గెలిచిన జట్టుగా ఆస్ట్రేలియాను వెనక్కి నెట్టి చరిత్ర సృష్టించింది. ఇంతటి అద్భుతమైన ట్రాక్ రికార్డ్ ఉన్నప్పటికీ, అదే ఏడాది రోహిత్ శర్మ వన్డే కెప్టెన్సీకి అకస్మాత్తుగా ఎండ్ కార్డ్ పడింది. దీనిపై చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ స్పందిస్తూ.. రోహిత్‌ను తొలగించడానికి అతని కెప్టెన్సీ ఫామ్ కారణం కాదని, జట్టు భవిష్యత్తును, యువ ఆటగాడు శుభ్‌మన్ గిల్‌ను కెప్టెన్‌గా తీర్చిదిద్దేందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని స్పష్టం చేశారు. 2027 వన్డే వరల్డ్ కప్ వచ్చేసరికి రోహిత్‌కు 40 ఏళ్లు పైబడతాయని, ఆ సమయంలో ఫిట్‌నెస్ సమస్యలు వస్తే జట్టు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతోనే ముందుగానే గిల్‌కు పగ్గాలు అప్పగించారు.




VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com